ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



బాపట్ల జిల్లా వార్తలు

5 శుక్రవారం 14 ఫిబ్రవరి 2025

సాగు.. పెరిగింది

- గత ఐదేళ్లతో పోలిస్తే అధికం
- 5.96 లక్షల ఎకరాల్లో వ్యవసాయం
- అంచనాలకు మించి వరి, పొగాకు, మొక్కజొన్న
- మిర్చి, వరికి నీటిని సరఫరా చేయాలంటోన్న రైతులు

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

రబీ సీజన్‌లో సాగు ఆశాజన కంగా ఉంది. గత ఐదేళ్ల కంటే ఈ ఏడాది సాగు గణనీయంగా పెరిగింది. సాధారణ విస్తీర్ణంలో 94 శాతం పంటలు సాగు చేయడం విశేషం. నీటి సరఫరా మెరుగ్గా ఉండటంతో సాగు పెరిగింది. పల్నాడు, గుంటూరు, బాపట్ల జిల్లాలో 5.96 లక్షల ఎకరాల్లో పంటలు సాగయ్యాయి. అంచనా లకు మించి వరి, మొక్కజొన్న, పొగాకు సాగు చేశారు. రబీలో వరి తర్వాత మొక్కజొన్న ప్రధాన పంట కాగా ఈ ఏడు సాగు భారీగా పెరిగింది. వరి సాగు కూడా రెండేళ్ల కంటే పెరిగింది. అంచనాలను తలకిందులు చేస్తూ పొగాకు సాగు చేపట్టారు. వరి సాధారణ విస్తీర్ణం 1,05,695 ఎకరాలు కాగా 86,730 ఎకరాల్లో సాగు చేశారు. మొక్కజొన్న మూడు జిల్లాల్లో సాధారణ విస్తీర్ణం 1,46,462 ఎకరాలు ఉంటే 1,39,227 ఎకరాల్లో సాగు చేశారు. పల్నాడు జిల్లాలో 55 శాతం అధికంగా మొక్కజొన్న సాగైంది. పల్నాడు జిల్లాలో విస్తృతంగా కంది సాగు చేశారు. సాధారణ విస్తీర్ణం 6,662 ఎకరాలు కాగా 8,292 ఎకరాల్లో సాగు చేశారు. సాధారణం కన్నా 24 శాతం పెరిగింది.



మొక్కజొన్న



పొగాకు



వరి

తగ్గిన శనగ.. పెరిగిన పొగాకు

పల్నాడు, బాపట్ల జిల్లాల్లో శనగ సాగు గణనీయంగా తగ్గింది. పల్నాడు జిల్లాలో సాధారణ విస్తీర్ణం కన్నా 35 శాతం, బాపట్ల జిల్లాలో 47 శాతం తగ్గింది. శనగ సాధారణ విస్తీర్ణం 1,23,970 ఎకరాలు కాగా 76,022 ఎకరాల్లో మాత్రమే ఈ సారి రైతులు సాగు చేశారు. శనగకు ప్రత్యామ్నాయంగా పొగాకు చేశారు. దీంతో పొగాకు సాగు పెద్దఎత్తున పెరిగింది. పొగాకు 28,812 ఎకరాలు సాధారణ విస్తీర్ణం కాగా 90,502 ఎకరాల్లో సాగు చేశారు. దాదాపు 61,690 ఎకరాల్లో పొగాకు సాగు పెరిగింది. సాధారణం కన్నా మూడు రెట్లకు పైగా పొగాకు సాగు పెరగడం గమనార్హం.

పంటల సాగు వివరాలు ఎకరాల్లో..

జిల్లా	సాధారణ విస్తీర్ణం	సాగు	శాతం
పల్నాడు	1,30,157	1,25,125	96
గుంటూరు	1,64,320	1,60,217	97
బాపట్ల	3,51,725	3,11,470	89

ఆశాజనకంగా సాగు..

పంటల సాగు ఆశాజనకంగా ఉంది. దిగుబడులు బాగుంటాయని రైతులు ఆశిస్తున్నారు. శనగ పంట నూర్పిళ్లు జరుగుతున్నాయి. పొగాకు కోత కొత్త దశలో ఉంది. కొన్ని ప్రాంతాల్లో మొక్కజొన్న కోతలు ముమ్మరంగా సాగుతున్నాయి. వరి నాట్లు పూర్తయ్యాయి. పొగాకు ధర కూడా ఆశాజనకంగా ఉందని రైతులు చెబుతున్నారు.

సాగర్ జలాశయంలో 191.25 టీఎంసీల నీటి నిల్వ

నాగార్జున సాగర్‌లో 312.05 టీఎంసీలు పూర్తి నిల్వ సామర్థ్యం కాగా 191.25 టీఎంసీల నీటి నిల్వ ఉంది జలాశయం నీటి మట్టం 590 అడుగులు కాగా గురువారం 541.3 అడుగులు నీటి మట్టం నమోదైంది. మిర్చికి మార్చి 31 వరకు, వరికి ఏప్రిల్ నెలాఖరు వరకు సాగు నీరు అవసరం ఉందని అప్పటి వరకు సరఫరా చేయాలని రైతులు కోరుతున్నారు.

ప్రేమానుబంధం

- రెండు జీవితాలను పెనవేసే మాధుర్యం
- ఒకరిపై ఒకరికి నమ్మకం.. జీవితకాల బాధ్యత
- వయసు ఆకర్షణనే ప్రేమగా భ్రమిస్తున్న యువత
- మూణ్ణాళ్ల ముచ్చటగా మారుతున్న అనుబంధం!



ప్రేమ.. రెండక్షరాల పదం.. కానీ దాని ప్రభావం అనంతం! సూర్యుడి చుట్టూ భూమి తిరిగినట్లు.. ప్రేమ చుట్టూ ప్రపంచం మొత్తం తిరుగుతోందంటే.. ప్రేమ మహత్తు గురించి ఇంకేం చెప్పాలి? రెండు హృదయాలను ఒక్కటి చేసే తీయని మకరందం.. ప్రేమ. రెండు జీవితాలను ఏకం చేసే అనుబంధమిది. మనిషికి మనసుతో వేసిన తియ్యటి అనుబంధం.. మనుగడకి మూలం.. ప్రేమామృతం. పిరికి వాడికి ధైర్యాన్నిస్తుంది.. ధైర్యవంతుడికి బలాన్నిస్తుంది ప్రేమ. అలాంటి మధుర భావన స్పృశించని హృదయం ఉండదంటే ఆశ్చర్యం కాకపోవచ్చు. భాష, ప్రాంతం, ఏదైనా.. ప్రేమ భావం మాత్రం మారదు. సృష్టిపై ప్రభావమూ మారదు. కులమతాలు ఏవైనా.. దీని అభిమతం మాత్రం ఒక్కటే. ఎవరు ఔనన్నా.. కాదన్నా.. ఈ ప్రేమ తత్వం మాత్రం శాశ్వతం. ఆ ప్రేమను గురించి.. వాలెంటైన్స్ డే సందర్భంగా ప్రత్యేక కథనం.

గుంటూరు, బాపట్ల, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): సకల చరాచర సృష్టిని నడిపించేది ప్రేమ ఒక్కటే. చెట్లూ, చేమలు, పశుపక్ష్యాదులు, జీవరాశి ఏదైనా సరే ప్రేమ మాధుర్యాన్ని చవిచూడాల్సిందే. అయితే వాటికి లేని అదృష్టం.. మనిషికి మాత్రమే దక్కిన అదృష్టం.. ఆ ప్రేమను వ్యక్తం చేయడం. ఇతరులపై కలిగిన అభిమానాన్ని.. ఏర్పడిన ఇష్టాన్ని చెప్పే అవకాశం ఒక్క మనిషికి మాత్రమే దక్కింది. ఆ అభిమా నాన్ని.. ఇష్టాన్ని మహోన్నతమైన ప్రేమగా మలు చుకునే అవకాశం మనకు మాత్రమే ఉంది. కొత్త బంగారులోకంలో ప్రవేశించే యువతీ- యువకుల మధ్య జనించే ప్రేమ మధుర్యం ఇంతని చెప్పలేము. ఆ మాధుర్యం కలకాలం కొనసాగించడమే యువత ముందున్న సవాలు. ప్రేమించుకునే సమయంలో ఏర్పడే అభిమానాలు, ఇష్టాలు, ప్రేమలు జీవితకాలం కొనసాగించడమే అసలైన ప్రేమ. అలాంటి ప్రేమను సొంతం చేసుకోవడమే యువతకు సవాలు. ఆ సవాలును ఎదుర్కోవాలంటే యువతీ యువకులకు ఎంతో చైతన్యం కావాలి.

● బాహ్య సౌందర్యమే ప్రేమా?

ప్రపంచాన్నేలే ప్రేమ గెలవాలంటే.. నిలవాలంటే.. ప్రేమంటే ఏమిటో తెలియాలి. యుక్తవయసులో ఏర్పడే ఆకర్షణనే నేటి యువత ప్రేమగా భ్రమిస్తోంది. ఒకరంటే.. ఒకరికి ఏమిటో తెలియ కుండానే.. అలవాట్లు.. జీవన విధానాలు.. తెలియ కుండానే.. బాహ్య సౌందర్యాన్ని చూసి ఆకర్షణలో పడిపోతున్నారు. ఎదుటివారి అంతఃసౌందర్యాన్ని వీక్షించకుండానే, హృదయ సౌందర్యాన్ని అనుభూతి చెందకుండానే ప్రేమలో పడిపోతున్నారు. అందుకే చిరకాలం నిలవాల్సిన ప్రేమ బంధాలు, అచిరకాలంలోనే అర్థాంతరంగా ఆగిపోతున్నాయి. ప్రేమంటే ఒకరి పట్ల ఒకరికి నమ్మకం. బాధ్యత. సహనం. క్షమ. నిజాయితీ. పట్టుదల ఉండాలి. మనోబలం ఉండాలి. కుంటుంబ జీవితంలో ఎదురయ్యే సవాళ్లను స్వీకరించే ధైర్యం, ఓపిక ఉండాలి. ఒకరి గౌరవాన్ని ఒకరు పెంచుకుంటూ ముందుకు సాగాలి. అయితే ఇలాంటి నిష్కల్మషమైన, నిర్మలమైన, నిస్వార్థమైన ప్రేమ ఉంటే అది కలకాలం నిలుస్తుంది. ఎన్ని అవాంతరాలు వచ్చినా గెలుస్తుంది. కానీ దురదృష్టవశాత్తూ యువతీ యువకుల మధ్య అలాంటి ప్రేమ కొరవడుతోంది.

సినిమా ప్రేమల వలలో.. యువత

సమాజంలో ప్రేమపై చాలా మందిలో సరైన అవగాహన లేదు. ప్రేమ అనగానే తల్లిదండ్రులు- బిడ్డలు పరస్పర

(మిగతా 8వ పేజీలో)

మారుతున్న ప్రేమ గమనం

కాలం మారినా.. తత్వం మార్చుకోని ప్రేమ.. తన గమనాన్ని మాత్రం మార్చుకుంటోంది. ఒకప్పటి ప్రేమకు పెళ్లి గమ్యమైతే.. నేటి ప్రేమ.. సహజీవనం చాలంటోంది. ఒకప్పుడు ఉమ్మడి కుటుంబాన్ని కోరుకున్న ఈ ప్రేమ.. నేడు ఒకరికి ఒకరం చాలంటోంది. పిల్లలూ వద్దంటోంది. పంచేకొద్దీ పెరిగే ఈ ప్రేమ.. అసలు పంచనే వద్దంటోంది. బాంధవ్యాలను తెంచేస్తోంది. అన్నీ అనుకూలించినా ప్రేమ అంతిమ గమ్యం పెళ్లి కాదనే ప్రమాద కర ధోరణులు గడచిన దశాబ్దాకాలంలో ఎక్కువైంది. ప్రేమ విషయంలో మారుతున్న యువత ఆలోచనా తీరు ఈ విధంగా ఉంటే ఈ సోషల్ మీడియా యుగంలో ప్రేమ పేరుతో బెదిరింపులు, ఎమోషనల్ బ్లాక్ మెయిల్స్, ఫొటో మార్ఫింగ్‌లు ఇవన్నీ ఆ మధురానుబంధానికి మరింతగా సవాళ్లు విసురుతున్నాయి.

6 **బ్లాక్ మార్కెట్లో నాన్ జ్యుడీషియల్ స్టాంప్‌లు**
● రెండు నెలలుగా తీవ్ర కొరత

కోటప్పకొండ తిరునాళ్లలో ట్రాఫిక్‌పై ప్రత్యేక చర్యలు
● ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి

మిర్చి ధర తగ్గిస్తే లైసెన్సు రద్దు
● మార్కెటింగ్ కమిషనర్ హెచ్చరిక

విద్యాజ్యోతిలో... అవినీతి



- జడ్పీ టెండర్ నిబంధనలకు నీళ్లు
- ఒకే తరహా పుస్తకానికి ఇద్దరు కాంట్రాక్టర్లు
- కమీషన్లతో నాసిరకం పేపర్‌తో మెటీరియల్ ముద్రణ
- అక్రమాలపై ఫిర్యాదు చేసేందుకు కొందరు జడ్పీటీసీలు సిద్ధం
- అధికారుల తీరుతోనే విద్యార్థులకు మెటీరియల్ పంపిణీలో జాప్యం

గుంటూరు సిటీ, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి గుంటూరు జిల్లా పరిషత్‌లో అవినీతి కంపు కొడుతోంది. అధికారులు పూర్తిగా అడ్డదారులు తొక్కుతున్నారు. చివరకు పేద విద్యార్థులకు పంపిణీ చేసే విద్యాజ్యోతి స్టడీ మెటీరియల్‌ను కూడా ఆదాయ వనరుగా మార్చుకున్నారు. అందుకోసం టెండర్ నిబంధనలకు పూర్తిగా నీళ్లొదిలారు. కవర్ పేజీకి ఒక రేటు.. లోపలి పేజీకి మరో రేటు అంటూ అవినీతికి లాకులు తెరిచారు. అధికారులే అందినకాడికి పుచ్చుకోవడంతో నాణ్యత లేని పేపర్‌తో మెటీరియల్‌ను కాంట్రాక్టర్ ముద్రించారన్న ఆరోపణలున్నాయి. విద్యాజ్యోతి పుస్తకం ముద్రణ, టెండర్ ప్రక్రియలో జరిగిన అక్రమాలపై ఫిర్యాదు చేసేందుకు కొంతమంది జడ్పీటీసీలు సిద్ధమయ్యారు. ఉమ్మడి గుంటూరు జిల్లా పరిధిలోని జిల్లా పరిషత్ పాఠశాలల్లో పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించేందుకు ఏటా విద్యాజ్యోతి పేరుతో స్టడీ మెటీరియల్ అందజేస్తున్నారు. ఇందు కోసం జడ్పీ నిధులను రూ.60 లక్షల నుంచి రూ.80 లక్షల వరకు వెచ్చిస్తుంటారు. ఈ ఏడాది కూడా విద్యాజ్యోతి స్టడీ మెటీరియల్ పంపిణీకి శ్రీకారం చుట్టారు. అన్ని జడ్పీ పాఠశాలల్లో సుమారు 34 వేల మంది విద్యార్థులు ఉన్నట్లు విద్యాశాఖ ఇచ్చిన సమాచారంతో టెండర్ ప్రక్రియకు వెళ్లారు.



టెండర్లు పిలవాల్సింది ఎవరు?

పంచాయతీరాజ్ చట్టం, ప్రభుత్వ నిబంధనల ప్రకారం జిల్లా పరిషత్‌కు సంబంధించిన అన్ని టెండర్లు జడ్పీ డిప్యూటీ సీఈవో పిలవాలి. ప్రతిసారి ఆ విధంగానే జరుగుతుంది. అయితే జడ్పీ డ్రాయింగ్ అధికారి ఇవ్వాల్సిన టెండర్‌ను ఈ ఏడు మాత్రం మరొకరి పేరుతో జారీచేశారు. పుస్తకాల ముద్రణ బాధ్యతను ఇద్దరు కాంట్రాక్టర్లకు అప్పగించడం వివాదంగా మారింది. ఎప్పుడూ ఒకరికి మాత్రమే కాంట్రాక్టును అప్పగించేవారు. ఈసారి పట్టుబట్టి మరీ వేరే జిల్లా నుంచి మరో కాంట్రాక్టర్‌ను బరిలోకి దింపారు. ఎప్పుడూ పుస్తకాలు సరఫరా చేసే కాంట్రాక్టర్ గతంలో కమీషన్ సరిగా చెల్లించకపోవడంతో కాంట్రాక్టును రెండు భాగాలుగా చేసినట్లు ప్రచారం జరుగుతోంది.

రూ. 4 కోట్ల నిధులకు రెక్కలు..

జడ్పీలో మరో వివాదం తలెత్తింది. ప్రభుత్వం తాజాగా కేటాయించిన 15వ ఆర్థిక సంఘం పనుల కేటాయింపులో చేతివాటం మొదలైందన్న ఆరోపణలున్నాయి. రూ.4 కోట్ల వ్యవహారంలో నిబంధనలను మీరి ఒకరికి బదులు మరొకరు పనుల కేటాయింపునకు పూనుకుంటున్నారు. కనీసం రెండు శాతం తగ్గకుండా కమీషన్ ఇచ్చిన వారికే పనులు ఇస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. దీనిపై కూడా ఫిర్యాదుకు కొందరు జడ్పీటీసీలు సిద్ధమయ్యారని సమాచారం.

రేటు తక్కువ అని...

గతంలో విద్యార్థులకు పంపిణీ చేసిన విద్యాజ్యోతి స్టడీ మెటీరియల్‌కు ఇప్పటి మెటీరియల్‌కు చాలా తేడా ఉంది. గతంలో పేజీకి 33 పైసలు చొప్పున చెల్లించి నాణ్యమైన పేపర్‌తో పుస్తకాలు ముద్రించేలా చూసే వారు. ఇప్పుడు పేజీ 31 పైసలకు కాంట్రాక్టు ఇచ్చి నిధులు ఆదా చేశామని అధికారులు చెబుతున్నారు. కానీ ప్రస్తుతం పంపిణీ చేసిన స్టడీ మెటీరియల్ పూర్తి నాసిరకం కలిగిన పేపర్‌తో ప్రింట్ చేశారు. తక్కువ గేజ్ కలిగిన పేపర్ వాడటంతో మెటీరియల్ చూడడానికి కూడా చాలా ఇబ్బందిగా ఉంది. పేజీ రేటు తగ్గించి కాంట్రాక్టు ఒకే చేశామని అధికారులు చెబుతున్నారు. అయితే పేజీ రేటు తగ్గించి కమీషన్ల పెంచడంతో పుస్తకం నాసిరకంగా మారిందన్న ఆరోపణలున్నాయి. కవర్ పేజీకి ఒక రకమైన కమీషన్, లోపలి పేజీలకు మరో రకమైన కమీషన్ ఒప్పందం జరిగినట్లు తెలుస్తోంది. కమీషన్ల సంగతి తేలకపోవడంతోనే విద్యాజ్యోతి ఫైల్ నెల రోజులకు పైబడి పెండింగ్‌లో ఉన్నట్లు చెబుతున్నారు. అధికారుల తీరు వల్ల ఎప్పుడూ డిసెంబరులోనే విద్యార్థులకు అందే స్టడీ మెటీరియల్ ఈ ఏడాది ఫిబ్రవరి 8 వ తర్వాత పాఠశాలలకు చేరింది.

పట్టభద్రుల బరిలో 25 మంది

- ఐదుగురు నామినేషన్ల ఉపసంహరణ
- బ్యాలెట్ పేపర్ ముద్రణకు ఆర్వో ఆదేశాలు
- ఎమ్మెల్సీ ఎన్నికలకు తుది ఓటర్ల సంఖ్య 3,47,116

గుంటూరు, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): కృష్ణా-గుంటూరు పట్టభద్రుల శాసనమండలి నియోజకవర్గ ఎన్నికల నామినేషన్ల ఉపసంహరణ గడువు ముగిసింది. గురువారం మధ్యాహ్నం 3 గంటల లోపు ఐదురుగు అభ్యర్థులు నామినేషన్లను ఉపసంహరించుకున్నారు. మేరిగ మోహన్‌రావు, బొట్ల శివసత్యన్నారాయణ, మంత్రి బాలకృష్ణ, డేగల సైదారాజు, గుడిశ రాంబాబు తమ మద్దతుదారులతో కలిసి కలెక్టరేట్‌కు వచ్చి ఆర్వో నాగలక్ష్మిని కలిసి నామినేషన్లను ఉపసంహరించుకుంటున్నట్లు ఫారాలను అందజేశారు. అనంతరం ఎన్నికల తుదిపోరులో నిలిచిన 25 మంది అభ్యర్థుల జాబితాను ఆర్వో విడుదల చేశారు. అనంతరం బ్యాలెట్ పేపర్ ముద్రణకు ఆదేశించారు. ఎన్‌డీఏ కూటమి అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్, సిట్టింగ్ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావుతో పాటు కనకం శ్రీనివాసరావు, యెంర్రెడ్డి శివారెడ్డి, గుణుకుల వెంకటేశ్వర్లు, గౌతుకట్ల వెంకటరావు, చుండూరు సత్యబాల సుందరరామశర్మ, లగడపాటి వేణుగోపాల్, జూపూడి శ్యాంప్రసాద్, మురకొండ చంద్రశేఖర్, గంటా మమత, గుమ్మా శ్రీనివాసరావు, ఉమర్ బాషాషేక్, తిరువీధుల శారద, వినయ్‌కుమార్ తండియెమ్మిల, గంగోలు శామ్యూల్, అహ్మద్ షేక్, అరిగల శివరామప్రసాదు, రామకోటయ్య మద్దుమాల, దారా విక్రం, పై శోభారాణి, రాధాకృష్ణమూర్తి దుక్కిపాటి, అన్న వరపు ఆనంద కిశోర్, దీపక్ పులుగు ఎన్నికల బరిలో నిలిచి ఉన్నట్లు ఆర్వో ప్రకటించారు.

కోడ్‌ని పాటిస్తూ ప్రచారం చేసుకోవాలి

పోటీలో ఉన్న అభ్యర్థులు ఎన్నికల సంఘం నిర్దేశించిన కోడ్ ప్రకారం ప్రచార కార్యక్రమాలు నిర్వహించుకోవాలని ఆర్వో సూచించారు. పోటీలో ఉన్న అభ్యర్థులు, వారి ప్రతినిధులతో గురువారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ సమావేశ మందిరంలో ఆమె సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఓటర్లకు బూత్ లెవల్ అధికారులతో పోలింగ్ బూత్ వివరాలు తెలియచేస్తు స్లిప్‌లు పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. అభ్యర్థులు కూడా ఓటర్లను మార్గదర్శకం చేస్తూ తెల్ల పేపర్‌పై పార్టీ గుర్తులు, రంగులు, లేకుండా కేవలం ఓటరు పేరు, పోలింగ్ బూత్, సీరియల్ నంబరుతో మాత్రమే ఓటరు స్లిప్‌లు పంపిణీ చేసుకోవచ్చన్నారు. ప్రచార కార్యక్రమాలకు కరపత్రాలు, వీడియో సందేశాల్లో ఉన్న కంటెంట్‌కు ముందుగా ఎంసీఎంసీ నుంచి అనుమతి తీసుకోవాలన్నారు. సోషల్ మీడియాల్లో, ఇతర ప్రచార కార్యక్రమాలు, ర్యాలీలు, సభలకు అనుమతులు సంబంధిత జిల్లాలోని అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి నుంచి తీసుకోవాలని స్పష్టం చేశారు. ఎన్నికల విధుల్లో ఉన్న ఉద్యోగులకు పోస్టల్ బ్యాలెట్ ఓటు ఫెసిలిటేషన్ సెంటర్లలో కాకుండా పాత విధానంలో ఉద్యోగులు 12 ఫారం ద్వారా దరఖాస్తులు రిటర్నింగ్ అధికారికి పోస్ట్‌లో అందిస్తే బ్యాలెట్ పేపర్‌ను పోస్ట్ ద్వారా అందిస్తామన్నారు. ఓటు వేసిన బ్యాలెట్ పేపర్లు మార్చి 3కి రిటర్నింగ్ అధికారి కార్యాలయానికి చేరే విధంగా పోస్ట్ చేయాలన్నారు. 483 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని, ప్రతి పోలింగ్ కేంద్రానికి అభ్యర్థులు పోలింగ్ ఏజెంట్‌ను నియమించుకోవచ్చన్నారు. పోలింగ్ రోజు పోలింగ్ కేంద్రానికి 200 మీటర్లు దాటిన తర్వాత అభ్యర్థులు ఓటర్లను మార్గదర్శకం చేయడానికి కేంద్రం ఏర్పాటు చేసుకోవచ్చన్నారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళికి విరుద్ధంగా అభ్యర్థులు ప్రవర్తిస్తే కేసులు నమోదు చేస్తామన్నారు. సమావేశంలో అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి ఖాజా వలి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ లక్ష్మీకుమారి తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్సీ ఎన్నికల అభ్యర్థులు, ప్రతినిధులతో సమావేశమైన ఆర్వో నాగలక్ష్మి


ఓటర్ల జాబితా విడుదల

కృష్ణా - గుంటూరు పట్టభద్రుల శాసనమండలి నియోజకవర్గం ఎన్నికలకు సప్లిమెంటరీలతో కలిపి తుది ఓటర్ల జాబితా విడుదలైంది. గురువారం ఎన్నికల సంఘం అనుమతి తీసుకుని జాబితాని రిటర్నింగ్ అధికారి ప్రకటించారు. నవీకరించిన జాబిత ప్రకారం 2,06,456 మంది పురుషులు, 1,40,615 మంది స్త్రీలు, 45 మంది ట్రాన్స్‌జెండర్లు కలిపి మొత్తం ఓటర్ల సంఖ్య 3,47,116గా ఉన్నది. పోలింగ్ కోసం 483 బూత్‌లను వినియోగించనున్నారు. పోలింగ్ సిబ్బంది నియామకం కూడా పూర్తి చేసినట్లు ఆర్వో తెలిపారు. గుంటూరులో 149 బూత్‌లకు 185 మంది పీవోలు, 185 మంది ఏపీవోలు, 379 మంది ఓపీవోలు, 178 మంది మైక్రో అబ్జర్వర్లు, 26 మంది సెక్టోరల్, 26 మంది రూట్ అధికారులను నియమించామన్నారు. వీరందరికి ఈ నెల 21న రెండో విడత శిక్షణ ఇస్తామన్నారు. శాంతిభద్రతల పరిరక్షణకు 888 మంది పోలీసు సిబ్బందిని నియమించామన్నారు. ఎన్నికల కోసం 1,444 బ్యాలెట్ బాక్సులను సిద్ధం చేశామని చెప్పారు. డిస్ట్రిబ్యూషన్, రిసెప్షన్, కౌంటింగ్ సెంటర్లను గుంటూరు నగరంలోని ఏసీ కళాశాలలో ఏర్పాటు చేసినట్లు ఆర్వో వివరించారు.

జిల్లా	ఓటర్లు	పోలింగ్ కేంద్రాలు
గుంటూరు	1,08,109	149
బాపట్ల	24,493	34
పల్నాడు	57,238	90
ఏలూరు	16,099	21
కృష్ణా	63,114	77
ఎన్‌టీఆర్	78,063	112

ఆప్కాస్‌ని రద్దు చేసే ఆలోచన సరైనది కాదు

- కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల జేఏసీ చైర్మన్ ఏవీ నాగేశ్వరరావు



మాట్లాడుతున్న నాగేశ్వరరావు, పాల్గొన్న సీఐటీయూ నాయకులు

గుంటూరు (తూర్పు), ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): ఆప్కాస్ రద్దు చేయాలనే ఆలోచన విరమించుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల జేఏసీ చైర్మన్, సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు ఏవీ నాగేశ్వరరావు కోరారు. జీజీహెచ్ ఆవరణలో గురువారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆప్కాస్‌ను రద్దు చేసి ఏజెన్సీలకు అప్పగిస్తే దాదాపు లక్ష ఇరవై వేల మంది ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు నష్టపోతారని అన్నారు. ఏజెన్సీ వ్యవస్థ కింద పనిచేసే సమయంలో దళారులు సకాలంలో జీతాలు, పీఎఫ్ చెల్లించకుండా వందల కోట్లు దోపిడీ చేశారని అన్నారు. ఆప్కాస్ వ్యవస్థ ఉండటం వల్లే ప్రతి నెలా 1వ తేదీన జీతాలు, సకాలంలో పీఎఫ్‌లు తీసుకుంటున్నామని అన్నారు. ఆప్కాస్‌లో పనిచేసే ఉద్యోగులకు మినిమం ఆఫ్ టైం స్కేల్ అమలు చేయాలని, కాంట్రాక్టు విధానంలోకి మార్చాలని కోరారు. పారామెడికల్ ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు వి.రమేష్ బాబు మాట్లాడుతూ ఆప్కాస్‌ని రద్దుచేసి ఉద్యోగులకు అన్యాయం చేస్తే సహించేది లేదని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. సమావేశంలో బి.లక్ష్మణరావు, బి.ముత్యాలరావు, నందిగామ నాగరాజు, ఎస్.కె పాచ్చా, స్నేహ, జానీ బాషా, నాగునాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఓవరాల్‌గా ఉమ్మడి గుంటూరు జిల్లా



బహుమతులు సాధించిన వ్యాయామ ఉపాధ్యాయులు

కారంపూడి, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): ఏపీ పీఈటీ, శాప్ అసోసియేషన్ ఆధ్వర్యాన ఈ నెల 8, 9, 10 తేదీల్లో కాకినాడలో జరిగిన 13 ఉమ్మడి జిల్లాల వ్యాయామ ఉపాధ్యాయిని, ఉపాధ్యాయుల రాష్ట్ర స్థాయి సెమినార్ కం గేమ్స్‌లో ఉమ్మడి గుంటూరు జిల్లా ఓవరాల్‌గా నిలిచిందని జిల్లా వ్యాయామ ఉపాధ్యాయ సంఘం అధ్యక్షుడు, కారంపూడి జడ్పీహెచ్ఎస్ పీడీ స్వర్ణరాజు, ప్రధాన కార్యదర్శి ఖాదర్ మస్తాన్ తెలిపారు. ఉమ్మడి గుంటూరు జిల్లా తరుపున పాల్గొని ఎక్కువ బహుమతులు సాధించిన వ్యాయామ ఉపాధ్యాయులను గురువారం పాఠశాలలో జిల్లా స్కూల్ గేమ్స్ సెక్రటరీ సురేష్, జిల్లా సీనియర్ వ్యాయామ ఉపాధ్యాయుడు చిన రామయ్య, మాజీ స్కూల్ గేమ్స్ సెక్రటరీ చిరంజీవిరావు, అసిస్టెంట్ స్కూల్ గేమ్ సెక్రటరీ రాధాకృష్ణమూర్తి అభినందనలు తెలిపారు.

చిలకలూరిపేట ఎంఈవో లక్ష్మి సస్పెన్షన్

చిలకలూరిపేట, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు ఈ నెల 10న పట్టుబడిన చిలకలూరిపేట ఎంఈవో-1 కె.లక్ష్మి విధుల నుంచి సస్పెండ్ అయ్యారు. ఈ మేరకు పాఠశాల విద్యాశాఖ ఆర్‌జేడీ బి.లింగేశ్వరరెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. అనుమతి లేకుండా ఆమె చిలకలూరిపేట వదిలి వెళ్లరాదని ఆయన ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

బ్లాక్ మార్కెట్లో నాన్ జ్యుడీషియల్ స్టాంప్‌లు

- రెండు నెలలుగా తీవ్ర కొరత
- డీఆర్ కార్యాలయంలో అందుబాటులో ఉన్నా.. పంపిణీ చేయకపోవడం పై అనుమానాలు
- ఈ స్టాంపింగ్ వారి ప్రయోజనం కోసమేనని ఆరోపణలు

గుంటూరు, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): నాన్ జ్యుడీషియల్ స్టాంపుల కోసం ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రజల అవసరాన్ని దృష్టిలో పెట్టుకుని కొందరు స్టాంపు వెండర్లు బ్లాక్‌లో విక్రయిస్తున్నారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో నాన్ జ్యుడీషియల్ స్టాంప్‌లను పూర్తిగా తొలగించే ఆలోచన చేశారు. అంతేగాక రిజిస్ట్రేషన్‌కు సంబంధించిన ఆన్‌లైన్ ప్రక్రియను ప్రైవేట్ ఏజెన్సీకి అప్పగించారు. చివరకు ఈ స్టాంపింగ్ విధానాన్ని కూడా ప్రైవేటు ఏజెన్సీకే కేటాయించారు. గతంలో కేంద్ర ప్రభుత్వ ఆధీనంలో ఉన్న ఎన్ఐసీ దీనిని నిర్వహించేది. అయితే వైసీపీ ప్రభుత్వం దీనిని ప్రైవేట్ ఏజెన్సీకి అప్పగించడమే కాకుండా రిజిస్ట్రేషన్ విధానాలను 2.0 పేరుతో కొత్త విధానాన్ని తీసుకువచ్చింది. అదే సమయంలో నాన్ జ్యుడీషియల్ స్టాంపులతో సంబంధం లేకుండానే ఈ స్టాంపింగ్ ద్వారా రిజిస్ట్రేషన్ విధానాన్ని కొనసాగించేందుకు నిర్ణయించింది. దీనిపై ప్రజల నుంచి తీవ్ర నిరసన వ్యక్తం అయినప్పటికీ ప్రభుత్వం ముందుకే వెళ్లింది.

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత

అయితే రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నాన్ జ్యుడీషియల్ స్టాంప్‌ల వినియోగాన్ని గతంలో మాదిరిగానే కొనసాగించాలని ఆదేశించింది. అయితే ఇందుకు సంబంధించి నాన్ జ్యుడీషియల్ స్టాంపులను పూర్తి స్థాయిలో అందుబాటులో ఉంచాల్సి ఉన్నప్పటికీ గత రెండు నెలలుగా గుంటూరులో నాన్ జ్యుడీషియల్ స్టాంపుల కొరత తీవ్రంగా ఉంది. సాధారణంగా ఈ నాన్ జ్యుడీషియల్ స్టాంపులను ఆస్తుల క్రయవిక్రయాల నుంచి ఒప్పందాల వరకు, అదేవిధంగా పబ్లిక్ కాపీలు, అఫిడవిట్లకు వినియోగిస్తుంటారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నుంచి నాన్ జ్యుడీషియల్ స్టాంపుల వినియోగం ఎక్కువైంది. అవసరాలకు అనుగుణంగా ఆయా స్టాంపులను జిల్లా రిజిస్ట్రేషన్ శాఖ అధికారులు తెప్పిస్తున్నప్పటికీ వాటిని క్షేత్రస్థాయిలో స్టాంపు వెండర్లకు అందజేయడంలో జరుగుతున్న జాప్యం కారణంగా నాన్ జ్యుడీషియల్ స్టాంపుల కొరత అధికమైంది. ఇప్పటికే జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయానికి పెద్ద సంఖ్యలో నాన్ జ్యుడీషియల్ స్టాంపులు వచ్చినట్లు ప్రచారం జరుగుతుంది.

ఈ స్టాంపింగ్ వారి కోసమేనా...?

డీఆర్ కార్యాలయానికి స్టాంపుల ఇండెంట్ వచ్చినప్పటికీ సంబంధిత సిబ్బంది, వాటిని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల ద్వారా స్టాంపు వెండర్లకు పంపిణీ చేయడంలేదు. ఇది ఈ స్టాంపింగ్ వారి ప్రయోజనాల కోసమేనన్న ఆరోపణలు వస్తున్నాయి. నాన్ జ్యుడీషియల్ స్టాంపులను బ్లాక్ చేస్తే సాధారణంగా ప్రజలు ఈ స్టాంపింగ్ వైపు మొగ్గు చూపుతారు. ప్రస్తుతం నాన్ జ్యుడీషియల్ స్టాంపుల కొరతకు ఇదే కారణమని పలువురు స్టాంప్ వెండర్‌లు ఆరోపిస్తున్నారు. దస్తావేజులు, ఒప్పందాలు మినహా మిగిలిన వాటికి ఈ స్టాంపింగ్ వినియోగించుకుందాం అనుకున్నా సర్వర్ సమస్యల కారణంగా అవి కూడా సరిగా అందుబాటులోకి రావడం లేదు. ఫలితంగా ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఇకనైనా రిజిస్ట్రేషన్ శాఖ ఉన్నతాధికారులు స్పందించి తక్షణం నాన్ జ్యుడీషియల్ స్టాంపుల కొరతను తీర్చాలని ప్రజలు కోరుతున్నారు.

తిరునాళ్లలో ట్రాఫిక్‌పై ప్రత్యేక చర్యలు

- ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి



కోటప్పకొండలో బందోబస్తు ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి, ఎస్పీ శ్రీనివాసరావు

నరసరావుపేట, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): మహాశివరాత్రికి కోటప్పకొండ త్రికోటేశ్వరస్వామి తిరునాళ్లలో ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా ప్రత్యేక చర్యలు చేపట్టాలని పోలీసు అధికారులను ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి ఆదేశించారు. కోటప్పకొండలో తిరనాళ్ల బందోబస్తు ఏర్పాట్లను అయన గురువారం పరిశీలించారు. గత తిరునాళ్ల సమయంలో ఎక్కడ ట్రాఫిక్ సమస్య తలెత్తితే, దానికి కారణం తెలుసుకుని ఆ విధమైన సమస్య ఉత్పన్నమవకుండా చూడాలని సూచించారు. తిరునాళ్ల బందోబస్తుకు పోలీస్ అధికారులు సన్నద్ధం కావాలన్నారు. కోటప్పకొండ తిరునాళ్ల, పరిసర ప్రాంతాలలో ఏర్పాటు చేసినటువంటి పార్కింగ్ స్థలాలు, స్నానాల ఘాట్, ప్రభలు నిలిపే ప్రాంతాలు, బస్సులు నిలుపు ప్రదేశాలను త్రిపాఠి పరిశీలించారు. తిరునాళ్లకు సంబంధించి వివిధ ఏర్పాట్లు, వాహన రాకపోకలు, వాహనాల పార్కింగ్, భక్తుల కోసం క్యూలైన్ల ఏర్పాటు, ప్రభలు నిలుపు ప్రదేశాలు ఎంపికపై ముందస్తు ప్రణాళిక రూపొందించుకోవాలని పోలీస్ అధికారులను ఆదేశించారు. రోడ్లు, భవనాల శాఖ అధికారుల సమన్వయంతో ఎక్కడైనా రోడ్లు వెడల్పు చేయించడం, రోడ్డు మార్గాలలో అవాంతరాలు ఉంటే తొలగించడం, బ్రిడ్జి, కల్వర్టులకు అవసరమైన చోట మరమ్మతులు చేయించాలన్నారు. తిరునాళ్ల ముగిసే వరకు పోలీసులు అప్రమత్తంగా వ్యవహరించాలని, భారీ బందోబస్తు నిర్వహించాలని చెప్పారు. కొండకు ప్రభలు తరలివచ్చే సమయంలో ఎటువంటి అవాంతరాలు ఎదురవకుండా, ట్రాఫిక్ సమస్యలు నివారించేందుకు తగినంత మంది పోలీస్ సిబ్బందిని కేటాయించి తగిన చర్యలు తెసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎస్పీ కంచి శ్రీనివాసరావు, అదనపు ఎస్పీ జేవీ సంతోష్, అదనపు ఏఆర్ ఎస్పీ వి. సత్తిబాబు, డీఎస్పీ కె.నాగేశ్వరరావు, ఏఆర్ డీఎస్పీ మహాత్మా గాంధీ రెడ్డి, ఎస్‌బీ సీఐలు బండారు సురేష్ బాబు, ఎస్‌బీ సీఐలు పి.శరత్ బాబు, నరసరావుపేట రూరల్ రామకృష్ణ, పట్టణ సీఐ హైమారావు తదితరులు పాల్గొన్నారు.

భక్తులకు ఇబ్బంది లేకుండా చర్యలు

అమృతలూరు, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): మహాశివ రాత్రి ఉత్సవాలకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు చేపడుతున్నట్లు జిల్లా ఎస్పీ తుషార్ డూడీ పేర్కొన్నారు. జిల్లాలో ప్రసిద్ధి చెందిన శైవక్షేత్రం గోవాడ బాలకోటేశ్వరస్వామి ఉత్సవాల ఏర్పాట్లును ఆయన స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆలయ పోలీసు అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ నెల 26న జరగనున్న మహాశివరాత్రికి లక్షల మంది భక్తులు వచ్చే అవకాశం ఉన్నందున ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. దేవస్థానం పరిసరాల్లో డ్రోన్ కెమెరాల నిఘాతోపాటు, సీసీ కెమెరాల నిఘా ఉంటుందన్నారు. రేపల్లె డీఎస్పీ ఎ.శ్రీనివాసరావు, ఎస్‌బీ సీఐ నారాయణ, చుండూరు సీఐ సీహెచ్ఎల్ఎన్ శ్రీనివాసరావు, ఎస్ఐ అమర్‌వర్ధన్ ఉన్నారు.



మహాశివరాత్రి ఉత్సవాల ఏర్పాట్లుపై సూచనలు ఇస్తున్న జిల్లా ఎస్పీ తుషార్ డూడీ

మిర్చి ధర తగ్గించేందుకు చూడొద్దు

- అలా చేస్తే లైసెన్సుల శాశ్వత రద్దు
- మార్కెటింగ్ కమిషనర్ విజయ సునీత హెచ్చరిక

గుంటూరు, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): రైతులకు న్యాయబద్ధంగా రావాల్సిన మిర్చి ధరని తగ్గించేందుకు ఏ ఒక్కరూ ప్రయత్నం చేయొద్దని మార్కెటింగ్ శాఖ రాష్ట్ర కమిషనర్ విజయ సునీత ఆదేశించారు. రైతులకు నష్టం చేయాలని చూస్తే ప్రభుత్వం ఊరుకోబోదని హెచ్చరించారు. మిర్చి రైతుల ఆర్థిక ప్రయోజనాలే తమకు ముఖ్యమని, వారికి ఇబ్బంది కలిగితే ఎంతటి వ్యాపారస్తుల లైసెన్సులనైనా శాశ్వతంగా రద్దు చేస్తామని మందలించారు. గురువారం సాయంత్రం చుట్టుగుంటలోని మార్కెటింగ్ కమిషనరేట్‌లో ఆమె మిర్చి విదేశీ ఎగుమతిదారులతో ప్రత్యేకంగా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో తొలుత 'ఆంధ్రజ్యోతి' గుంటూరు సంచికలో గురువారం 'మిర్చి ఎగుమతిదారుల రహస్య సమావేశం' అనే శీర్షికతో ప్రచురితమైన కథనాన్ని ప్రస్తావిస్తూ వివరణ ఇవ్వాలని ఆదేశించారు. అయితే సమావేశానికి హాజరైన ఎక్స్‌పోర్టర్లు తాము ఎక్కడా సమావేశం కాలేదని వివరణ ఇచ్చే ప్రయత్నం చేశారు. ఆ వెంటనే కమిషనర్ ఎగుమతిదారులను వారిస్తూ తమ వద్ద భేటీకి సంబంధించి సీసీ టీవీ ఫుటేజ్‌లున్నాయన్నారు. దీనిపై పూర్తి విచారణ జరుపుతున్నామన్నారు. ఎవరైనా ఎగుమతి, దిగుమతి వ్యాపారస్తులు కావాలని మిర్చి ధర పెరగకుండా ఎలాంటి చర్యలు చేపట్టొదన్నారు. రైతులు ఆరుగాలం కష్టించి అనేక వ్యయప్రయాసలకోర్చి మిర్చిని పండించి తీసుకొస్తున్నారని చెప్పారు. రైతులు మిర్చి తీసుకురాకపోతే మీ వ్యాపారాలు మూసేసుకోవాల్సి ఉంటుందన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకొని సాధ్యమైనంత వరకు ప్రస్తుతం ఉన్న ధర కంటే పెరిగేలా ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. సమావేశంలో మిర్చి విదేశీ ఎక్స్‌పోర్టర్లు వెలగపూడి సాంబశివరావు, తోట రామకృష్ణ, విజయకృష్ణ ట్రేడర్స్, మహేష్ ట్రేడర్స్, ఎన్‌కే ట్రేడర్స్ ప్రతినిధులు, మార్కెటింగ్ జేడీలు కాకుమాను శ్రీనివాసరావు, రాజశేఖర్, ఏడీ బి.రాజబాబు, మిర్చియార్డు సెక్రెటరీ ఎ.చంద్రిక, సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.



చుట్టుగుంట సమీపంలోని మార్కెటింగ్ కమిషనరేట్‌లో మిర్చి ఎక్స్‌పోర్టర్లతో సమావేశమైన కమిషనర్ విజయ సునీత

సమస్య పరిష్కారానికి సీఎం చొరవ చూపాలి

- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

అమరావతి, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): అగ్రిగోల్డ్ యాజమాన్య ఆస్తులతో పోల్చుకుంటే బాధితులకు చెల్లించాల్సిన మొత్తం లెక్కలోనిది కాదనీ, సీఎం చంద్రబాబు నాయుడు చొరవ తీసుకుని బాధితులకు న్యాయం చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ అన్నారు. పల్నాడు జిల్లా అమరావతిలో రెండు రోజులుగా జరుగుతున్న అగ్రిగోల్డ్ కస్టమర్స్, ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర స్థాయి విస్తృత సమావేశంలో గురువారం కె.రామకృష్ణ ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. సమావేశానికి అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తిరుపతిరావు అధ్యక్షత వహించారు. రామకృష్ణ మాట్లాడుతూ త్వరలో ముఖ్యమంత్రిని కలిసి అగ్రిగోల్డ్ బాధితుల సమస్యలు తెలియజేస్తామని అన్నారు. సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జంగాల అజయ్‌కుమార్ మాట్లాడుతూ బాధితుల సమస్యల పరిష్కారానికి పోరాటమే సరైన మార్గం అన్నారు. రెండు రోజుల సమావేశాలలో తీసుకున్న కార్యాచరణలో భాగంగా ఈ నెల 19, 20 తేదీలలో ఎంపీలు, ఎమ్మెల్యేలకు విజ్ఞాపన పత్రాలు అందజేస్తామని తెలిపారు. 24న అన్ని కలెక్టర్ కార్యాలయాల్లో అందజేయడంతోపాటు మార్చి 5 నుంచి రిలే నిరాహార దీక్షలు, చివరి రోజున భారీ ప్రదర్శన నిర్వహించనున్నట్లు తెలిపారు. అసోసియేషన్ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు ముప్పాళ్ల నాగేశ్వరరావు, అధ్యక్షుడు ఈవీ నాయుడు, ఉప ప్రధాన కార్యదర్శి బీవీ చంద్రశేఖర్, కర్నాటక రాష్ట్ర అసోసియేషన్ అధ్యక్షుడు గురుమూర్తి, ఒరిస్సా రాష్ట్ర అసోసియేషన్ అధ్యక్షుడు చంద్రరావు, తెలంగాణ రాష్ట్ర అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి మాల్యాద్రి పాల్గొన్నారు.

యోగాతో ఆరోగ్యం.. ఆనందం

పెదకాకాని, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): ఆధునిక జీవనశైలి సమస్యలన్నింటికి ఒకే ఒక పరిష్కారం 'యోగ-ధ్యానం' అని కోయంబత్తూర్ వరల్డ్ కమ్యూనిటీ సర్వీస్ సెంటర్ టీడీ ఎస్.ప్రసాద్ గురువారం పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంతర్గత ఐక్యత - బాహ్య సమతుల్యతలకు యోగ, ధ్యానమే సాధనాలని ఆయన తెలిపారు. రెండు రోజులుగా యోగా విభాగంలో జరిగిన జాతీయ కార్యశాల ముగింపు సభలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రచార్యులు పి.జాన్సన్, సత్యమూర్తి, జేఎన్‌టీయూ కళాశాలకు చెందిన సుధాదేవి, సిమ్స్ కళాశాలకు చెందిన డాక్టర్ ప్రియాంక, సమన్వయకర్త డి.సూర్య నారాయణ, రాధిక, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

చట్టం చూస్తూ ఊరుకోదు

- ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్



అమరావతి, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): అధికారాన్ని అడ్డుపెట్టుకుని నేరాలు చేసే నాయకుల విషయంలో చట్టం తనపని తాను చేసుకు పోతుందని పెదకూరపాడు నియోజకవర్గ ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ అన్నారు. గురువారం గన్నవరం మాజీ ఎమ్మెల్యే వైసీపీ నాయకుడు వల్లభనేని వంశీ అరెస్టుకు సంబంధించి వైసీపీ నాయకులు చేస్తున్న ప్రచారంపై ప్రవీణ్ స్పందించారు. వంశీ వైసీపీ అధికారాన్ని అడ్డుపెట్టుకుని జగన్మోహనరెడ్డి మెప్పుకోసం రాజకీయ భిక్ష పెట్టిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుపైన, నారా లోకేష్, నారా భువనేశ్వరిపైన అసత్య ఆరోపణలు చేశారని అన్నారు. అంతేకాకుండా గన్నవరం తెలుగుదేశం పార్టీ కార్యాలయంపై దాడి చేయించిన వంశీని అరెస్టు చేయడం సబబే అన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే నియోజకవర్గం నుంచి పారిపోయి హైదరాబాద్‌లో దాక్కున్న వంశీ పట్ల చట్టం తనపని తాను చేసుకుపోతుందన్నారు. వైసీపీ ప్రభుత్వం మాదిరిగా అక్రమ కేసులు, అక్రమ అరెస్టులు చేయించే సంస్కృతి కూటమి ప్రభుత్వానికి లేదన్నారు.

మహిళపై హత్యాయత్నం

- వివాహేతర సంబంధంతో విభేదాలు
- నడిరోడ్డుపై ఉలితో దాడి

వేమూరు, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి) : ఉదయం 10 గంటల సమయంలో ప్రధాన రహదారిపై ఓ మహిళపై హత్యాయత్నానికి పాల్పడిన సంఘటన గురువారం మండలంలోని జంపని గ్రామ శివారులో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే జంపని దళితవాడకు చెందిన ఏటుకూరి భాగ్యలక్ష్మి ఐదేళ్ల క్రితం భర్తతో విభేదాలు వచ్చి వదిలి వేసింది. ఆమెకు ఒక కుమార్తె ఉంది. అప్పటి నుంచి అదే గ్రామానికి చెందిన కార్పెంటర్ యల్లమాటి ప్రభాకర్‌తో వివాహేతర సంబంధం కొనసాగుతోంది. వారిద్దరి మధ్య విభేదాలు ఏర్పడ్డాయి. దీంతో ప్రభాకరరావు తన ఆలోచనకు వ్యతిరేకంగా భాగ్యలక్ష్మి వ్యవహరిస్తోందన్న కోపంతో ఆమెపై కక్ష పెంచుకున్నాడు. భాగ్యలక్ష్మి జీవనోపాధి కోసం తెనాలిలోని ఓ దుకాణంలో పని చేస్తుంది. రోజు మాదిరిగానే ఉదయం 10.30 గంటలకు ద్విచక్ర వాహనంపై జంపని నుంచి తెనాలి వెళ్తోంది. కొత్తగా నిర్మాణంలో ఉన్న ఆయిల్ బంకు వద్దకు చేరుకుంది. అదే సందర్భంలో తెనాలి నుంచి ద్విచక్ర వాహనంపై ఎదురుగా వస్తున్న ప్రభాకర్ తన చేతిలో ఉన్న కర్రను భాగ్యలక్ష్మి వాహనంపైకి విసిరి వేయడంతో ఆమె కిందకు పడిపోయింది. ఈ సందర్భంలో దగ్గరకు వెళ్లిన ప్రభాకర్, భాగ్యలక్ష్మిల మధ్య వివాదం చెలరేగింది. ప్రభాకర్ కార్పెంటర్ పనికి సంబంధించిన వస్తువుల్లో ఉలి తీసుకుని భాగ్యలక్ష్మి ఎడమ చేతిపైన, వీపు పైన తీవ్రంగా గాయపరిచాడు. సమీపంలో ఉన్న ప్రజలు దగ్గరకు వచ్చి గాయాలతో పడిపోయిన భాగ్యలక్ష్మిని తెనాలి ఆస్పత్రికి తరలించారు. తీవ్ర గాయాలు కావడంతో ఆమెను మెరుగైన చికిత్స కోసం గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. దీనిపై వేమూరు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఇంటిని కబ్జా చేసి కూల్చారు

- టీడీపీ గ్రీవెన్స్‌లో బాధితుల ఫిర్యాదు

గుంటూరు, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): వైసీపీ నాయకుడు తురకా కిషోర్ పేరు చెప్పి తమను చంపుతామని బెదిరిస్తున్నారనీ, తన కుమార్తెకు తాను ఇచ్చిన ఇంటిని కూల్చి కబ్జా చేశారనీ, ఈ దుర్మార్గానికి ఒడిగట్టిన పెద్దిరాజు, కృష్ణ, యండూరి వంశీ, ధనావత్ రమాదేవీ ఆమె భర్తపై చర్యలు తీసుకోవాలని చల్లా శివకుమార్ గురువారం మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో జరిగిన గ్రీవెన్స్‌లో మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి, రుడా చైర్మన్ బొడ్డు వెంకటరమణ చౌదరిలకు అర్జీ ఇచ్చి విజ్ఞప్తి చేశారు. అలాగే బాపట్ల జిల్లా భర్తిపూడిలో తమ గ్రామ పంచాయతీ అనుమతి లేకుండా సర్వే నంబర్ 65/2లో అక్రమ లేఅవుట్లు వేసి విక్రయిస్తున్నారని, దీంతో పంచాయతీ ఆదాయం కోల్పోతుందని, దీనిపై అధికారులు దృష్టి పెట్టి అక్రమ లేఅవుట్లను రద్దు చేయాలని ఆచంట అమరేష్ గ్రీవెన్స్‌లో అర్జీ ఇచ్చి విజ్ఞప్తి చేశారు. అదేవిధంగా పల్నాడు జిల్లా పిడుగురాళ్ల మండలం కరాలపాడు గ్రామానికి చెందిన చల్లా మంగమ్మ తమకు వారసత్వంగా వచ్చిన భూమిలోకి వెళ్లకుండా దారిలేదంటూ పైపొలం వారు అడ్డుకుంటున్నారని, దీనిపై సర్వే చేసి తాము పొలంలోకి వెళ్లేందుకు దారిని కల్పించాలని అర్జీ ఇచ్చి విజ్ఞప్తి చేశారు.

ఎల్ఎల్‌బీ పరీక్షా కేంద్రాల తనిఖీలు



పరీక్షా కేంద్రంను పరిశీలిస్తున్న ఆచార్య సుబ్బారావు

పెదకాకాని, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ పరిధిలో జరుగుతున్న ఎల్.ఎల్.బి. 3వ సెమిస్టర్, 7వ సెమిస్టర్ పరీక్షా కేంద్రాలను పీజీ కోర్సుల సమన్వయ కర్త ఆచార్య ఎమ్.సుబ్బారావు తనిఖీ చేశారు. గురువారం గుంటూరులోని జె.సి.కాలేజ్ ఆఫ్ లా పరీక్షా కేంద్రంలో ఆయన పరీక్షల ఏర్పాట్లను స్వయంగా పరిశీలించారు.

ఎల్ఎల్ఎమ్ రెండో సెమిస్టర్ ఫలితాలు విడుదల



ఫలితాలు విడుదల చేస్తున్న వర్సిటీ అధికారులు

పెదకాకాని, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): గత అక్టోబరు నెలలో జరిగిన ఎల్.ఎల్.ఎమ్. రెండో సెమిస్టర్ ఫలితాలను వర్సిటీ వెబ్‌సైట్‌లో బుధవారం పొందుపర్చినట్లు పరీక్షల నిర్వహణ నియంత్రణ అధికారి ఆలపాటి శివప్రసాదరావు తెలిపారు. 114 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 87 మంది ఉత్తీర్ణత సాధించినట్లు తెలిపారు. పునఃమూల్యాకనం కోసం ఫిబ్రవరి 14లోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

- విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.4.75
- నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	125,134,145
చికెన్ విత్ స్కిన్	236.00
చికెన్ స్కిన్ లెస్	246.00

1,35,941 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు గురువారం 1,24,013 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా ముందురోజు నిల్వ ఉన్న వాటితో కలిపి 1,35,941 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి ఏ చంద్రిక తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 57,175 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర	వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ			ఏసీ కామన్ వెరైటీ		
334	9000	13600	334	9000	11500
నెంబరు. 5	10000	12500	నెంబరు.5	--	--
273	10000	12200	273	--	--
341	10000	14200	341	--	--
4884	10000	12000	4884	--	--
సూపర్ 10	--	--	సూపర్ 10	--	--
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ			ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	10000	13900	తేజ	--	--
బ్యాడిగి	10000	13000	బ్యాడిగి	9000	11700
దేవనూరు డీలక్స్	10000	13500	దేవనూరు డీలక్స్	--	--
తెల్లకాయలు	4500	7500	తెల్లకాయలు	4500	7500

పోలీసుస్టేషన్‌లో ఎస్పీ ఆకస్మిక తనిఖీ

అమృతలూరు, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి) : స్థానిక పోలీసు స్టేషన్‌ను జిల్లా ఎస్పీ తుషార్ డూడీ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈసందర్భంగా పోలీసు స్టేషన్‌లోని రికార్డులను పరిశీలించారు. పాత నేరస్తుల కదలికలపై నిఘా ఉంచాలని ఆదేశించారు. కేసుల విచారణ వేగవంతం చేయాలన్నారు. సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. సిబ్బందితో మాట్లాడి శాఖపరంగా ఉన్న లోపాలను అడిగి తెలుసుకున్నారు. పోలీసు సిబ్బంది సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తామని చెప్పారు. కేసుల పురోగతిపై ఎప్పటికప్పుడు సీసీటీఎన్ఎస్‌లో నమోదు చేయాలన్నారు. స్టేషన్ పరిధిలోని ప్రతి గ్రామంలో సీసీ కెమెరాల ఏర్పాటుకు తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఆయన వెంట రేపల్లె డీఎస్పీ శ్రీనివాసరావు, చుండూరు సీఐ సీహెచ్ఎల్ఎన్ శ్రీనివాసరావు తదితరులు ఉన్నారు.

విద్యుత్ సరఫరాలో అంతరాయం

రేపల్లె, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): పట్టణంలో విద్యుత్‌లైన్ల మరమ్మతుల కారణంగా ఉదయం 7 నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని పట్టణ విద్యుత్‌శాఖ ఏఈ శివనాగిరెడ్డి అన్నారు. లక్ష్మీటాకీస్ సెంటర్ నుంచి బస్టాండ్ వరకు ఉప్పూడిరోడ్డు ఉప్పూడిగ్రామం విద్యుత్‌లైన్ల మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఆలయంలో చోరీపై కేసు

కొల్లూరు, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): ఆంజనేయస్వామి ఆలయంలో జరిగిన చోరీపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ ఏడుకొండలు గురువారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. కొల్లూరు శివారు యాదవపాలెంలోని అంజనేయస్వామి ఆలయంలో 11వ తేదీ అర్ధరాత్రి ఆలయం తలుపులు పగలగొట్టి స్వామి వారి హుండీలోని నగదు, వెండి హస్తముద్రికలను గుర్తు తెలియని వ్యక్తులు తస్కరించారు. 12వ తేదీన ఆలయ ధర్మకర్త వచ్చి పరిశీలించగా చోరీ జరిగినట్లు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. మొత్తం రూ.20 వేలు విలువ కలిగిన సొమ్ము అపహరణకు గురైనట్లుగా పేర్కొన్నట్లు ఎస్ఐ తెలిపారు.

రెండు ఇసుక ట్రాక్టర్లు స్వాధీనం

కొల్లూరు, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): ఇసుకను అక్రమంగా రవాణా చేస్తున్న రెండు ట్రాక్టర్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ ఏడుకొండలు గురువారం తెలిపారు. ఈ నెల 12వ తేదీ అర్ధరాత్రి మండల పరిధిలోని పెసర్లంక గ్రామ శివారులో ఎటువంటి అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను ఎస్ఐ అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. తదుపరి చర్యల నిమిత్తం తహసీల్దార్‌కు బైండోవర్ చేశారు.

గ్రామాభివృద్ధికి రామబ్రహ్మం రూ.3లక్షల విరాళం

నగరం, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): నగరం మండలపరిధిలోని పెద్దవరం గ్రామానికి చెందిన మాదివాడ రామబ్రహ్మం గ్రామాభివృద్ధికి రూ.3లక్షలను విరాళంగా అందించినట్లు గ్రామసర్పంచ్ తోట హరేరామ్ తెలిపారు. దాతలు ఇచ్చిన నిధులతో రైతులకు విశ్రాంతి కోసం షెల్టర్లు నిర్మించామని ఎండ, వాన నుంచి రక్షణ కల్పిస్తాయని ఇప్పటికే నిర్మాణాలు పూర్తి చేశారని త్వరలోనే అందుబాటులోకి వస్తాయని చెప్పారు. గతంలో కూడా రామబ్రహ్మం గ్రామాభివృద్ధికి రూ.50 వేలతో సిమెంట్ బల్లలను ఏర్పాటు చేయించారు. అలాగే గ్రామపరిసర ప్రాంతాల్లో మంచినీటి పంపులు విద్యార్థుల అవసరాల కోసం గ్రామాభివృద్ధికి నిరంతరం కృషి చేస్తారని సర్పంచ్ తెలియజేశారు. కార్యక్రమంలో పెద్దలు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

డాక్టర్ కృష్ణమూర్తి స్మారక ఉపన్యాసం

బాపట్ల, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): బాపట్ల ఎడ్యుకేషన్ సొసైటీ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ వైఎస్ కృష్ణమూర్తి స్మారక ఉపన్యాసం శనివారం మధ్యాహ్నం 3 గంటలకు స్థానిక రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ హాల్లో జరుగుతుందని బాపట్ల ఫోరంఫర్‌బెటర్ బాపట్ల కార్యదర్శి డాక్టర్ పీసీ సాయిబాబు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అవయవదానం అనే అంశంపై గుంటూరు ప్రభుత్వ వైద్యశాల సూపరింటెండెంట్, అవయవదాతల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ రమణ యశస్వీ కీలక ఉపన్యాసం చేస్తారని తెలిపారు. కార్యక్రమంలో ఇంకా గుంటూరు సర్వీస్ హెల్త్ ఆర్గనైజింగ్ అధ్యక్షుడు డాక్టర్ టి.సేవాకుమార్, ఆర్ట్స్ కళాశాల విశ్రాంత ప్రిన్సిపాల్ మూర్తి తదితరులు పాల్గొంటారన్నారు.

పరిశ్రమల స్థాపనకు ఔత్సాహికులను ప్రోత్సహించాలి

● జాయింట్ కలెక్టర్ ప్రఖర్‌జైన్



సమావేశంలో అధికారులకు సూచనలు చేస్తున్న జేసీ ప్రఖర్‌జైన్

బాపట్ల, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): పరిశ్రమల స్థాపన కోసం ఔత్సాహికులను మరింత ప్రోత్సహించాలని జాయింట్ కలెక్టర్ ప్రఖర్‌జైన్ తెలిపారు. గురువారం పరిశ్రమల ప్రోత్సాహక, అభివృద్ధి జిల్లా స్థాయి కమిటీ సమావేశాన్ని స్థానిక కలెక్టరేట్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ బాపట్ల జిల్లాలోని వివిధ పరిశ్రమలు నుంచి ఉత్పత్తి అవుతున్న వస్తువులను ఇతర ప్రాంతాలకు ఎగుమతి అయ్యేలా అధికారులు చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఉద్యాన పంటలను సేంద్రియ పద్ధతిలో ఉత్పత్తి చేస్తున్న తృణ, పప్పు ధాన్యాలు ఎగుమతి చేయటానికి చర్యలు తీసుకోవాలన్నారు. తద్వారా ఉత్పత్తిదారులకు ఎంతో ప్రోత్సాహం ఉంటుందని ఉత్పత్తులు పెరుగుతాయన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ప్రజలు సద్వినియోగించుకునేలా అధికారులు అవగాహన కల్పించాలన్నారు. బాపట్లజిల్లాలో పరిశ్రమల స్థాపనకు అధికారులు కృషి చేయాలన్నారు. పీఎంఈజీపీ పథకం కింద జిల్లాలో 189 దరఖాస్తులు వచ్చాయన్నారు. అందులో 90యూనిట్‌ల స్థాపనకు రూ.2.81 కోట్ల నిధులు మంజూరు చేశామన్నారు. పీఎం విశ్వకర్మ పథకం కింద 36,300 దరఖాస్తులు వచ్చాయన్నారు. ఇందులో 4,771 దరఖాస్తులను జిల్లా స్థాయి నుంచి అధికారికంగా ఆమోదిస్తూ ప్రభుత్వానికి నివేదించామన్నారు. ఆయా పథకాల ద్వారా లబ్ధి పొంది యూనిట్‌లు స్థాపించిన వారికి రాయితీ నిధులు విడుదలకు ఆమోదముద్ర వేశారన్నారు. 400 యూనిట్‌లకు రూ.9.13 కోట్ల రాయితీ సొమ్ము విడుదల చేయాలని ఆమోదిస్తూ ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపుతున్నట్లు ప్రకటించారు. సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల సర్వే ప్రక్రియ 68.87 శాతం జరగడంపై ఆరా తీశారు. ఈ పరిశ్రమలు జిల్లాలో 56,641 ఉన్నట్లు ప్రాథమికంగా గుర్తించామన్నారు. ప్రస్తుతం 36,744 పరిశ్రమల విద్యుత్ కనెక్షన్‌లను గుర్తించి జియోట్యాగ్ చేశామన్నారు. మిగిలినవి త్వరలో పూర్తి చేయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం సూచన మేరకు పరిశ్రమలపార్క్ ఏర్పాటు కోసం 75 ఎకరాల భూమిని గుర్తించే ప్రక్రియ చేపడతామన్నారు. ఈ సమావేశంలో జిల్లా పరిశ్రమల శాఖ జీఎం బి.శ్రీనివాసరావు, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ రిజిస్ట్రేషన్ లేని స్కాన్ సెంటర్ చట్టవిరుద్ధం

● జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ ఎస్ విజయమ్మ



కమిటీ సమావేశంలో వైద్యులకు సూచనలు చేస్తున్న డీఎంహెచ్‌వో డాక్టర్ ఎస్ విజయమ్మ

బాపట్ల, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ రిజిస్ట్రేషన్ లేకుండా స్కాన్ సెంటర్ నిర్వహించటం చట్టవిరుద్ధమని అలా చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ ఎస్ విజయమ్మ అన్నారు. గురువారం వైద్య, ఆరోగ్యశాఖ కార్యాలయంలో జిల్లా పీసీపీ ఏఎన్‌డీటీ డిస్ట్రిక్ లెవెల్ అడ్వయిజర్ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి స్కాన్‌సెంటర్ తప్పక నియమ నిబంధనలు పాటించాలన్నారు. రిజిష్టర్ స్కాన్ సెంటర్ యాజమాన్యం తప్పనిసరిగా ప్రతినెల ఫామ్ ఎఫ్ అప్‌లోడ్ చేయాలన్నారు. రిజిష్టర్ స్కాన్ సెంటర్‌లో ప్రతి 5 సంవత్సరాలకు ఒకసారి రెన్యువల్ చేయించుకోవాలని ఆర్ఎంపీ డిస్క్రిప్షన్ మీద ఎలాంటి స్కాన్లు చేయకూడదని తెలిపారు. లింగనిర్ధారణం చేయటం చట్ట రీత్యానేరమని తెలిపారు. సమావేశంలో ఏఎన్‌సీడీ జిల్లా నోడల్ ఆఫీసర్ డాక్టర్ సౌజన్య, డాక్టర్ బ్రహ్మం, గైనకాలజిస్ట్ శాంతి వైష్ణవి, డాక్టర్ సౌజన్య, బి.మరియమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఆశానోడల్ అధికారులకు శిక్షణ

బాపట్ల పట్టణంలోని జిల్లా వైద్యాధికారి కార్యాలయంలో కిల్కారి సేవలపై శిక్షణ గురువారం నిర్వహించారు. జిల్లా వైద్యాధికారి ఆధ్వర్యంలో ఆశానోడల్ అధికారులకు కిల్కారి మొబైల్ సేవల ఆవశ్యకతపై కిల్కారి ప్రోగ్రామ్ ఆఫీసర్ బి.రాజు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భారతప్రభుత్వం గర్భిణీ, శిశు ఆరోగ్య శ్రేయస్సుల కోసం కిల్కారి సేవలను ప్రవేశపెట్టిందని మొబైల్ ద్వారా అవసరమైన ఆరోగ్య సమాచారం వారికి అందజేస్తారన్నారు. గర్భిణి 4వనెల మొదలుకొని బిడ్డకు ఏడాది వయస్సు వరకు కిల్కారి సేవలు అందిస్తారన్నారు. గర్భిణి నమోదు సమయంలో ఇచ్చిన ఫోన్‌నెంబరుకు వారి ఆరోగ్యానికి అవసరమైన సమాచారం 01244451660 కిల్కారి నెంబరు ద్వారా అందజేస్తారు. మరలా తిరిగి వినటానికి 14423 టోల్‌ఫ్రీనెంబరుకు చేసి వినవచ్చునన్నారు. కార్యక్రమంలో డీపీహెచ్ఎన్‌వో పద్మావతి, జిల్లా ఆశానోడల్ ఆఫీసర్ వీఆర్ పాల్, పరమేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

మొండి బకాయిల వసూళ్లపై శ్రద్ధ వహించాలి

● మున్సిపల్ కమిషనర్ జి.రఘునాథరెడ్డి



ఇమ్మడిశెట్టిపాలెం సచివాలయంలో సిబ్బందిని వివరాలు అడిగి తెలుసుకుంటున్న మున్సిపల్ కమిషనర్ జి.రఘునాథరెడ్డి

బాపట్ల, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి) : మొండిబకాయిలు గుర్తించి వాటి వసూళ్ల విషయమై ప్రత్యేక శ్రద్ధ ఉంచాలని సచివాలయ సిబ్బందికి మున్సిపల్ కమిషనర్ జి.రఘునాథరెడ్డి సూచనలు చేశారు. గురువారం బాపట్ల పురపాలక సంఘ పరిధిలోని ఇమ్మడిశెట్టిపాలెం 15వ సచివాలయం వార్డుమెంబరు 24,15ను మున్సిపల్ కమిషనర్ జి.రఘునాథరెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆర్థిక సంవత్సరం పూర్తవుతున్నందున సచివాలయ కార్యదర్శులతో, మున్సిపల్ రెవెన్యూ సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. ఆస్తిపన్నులు, ఖాళీ స్థలం పన్నులు, నీటికుళాయి చార్జీల వసూళ్ల వేగవంతం చేయాలని సిబ్బందిని ఆదేశించారు. పన్నుల వసూళ్ల విషయంలో అలసత్వం వహిస్తూ చర్యలకు వెనుకాడేదిలేదన్నారు. క్షేత్ర స్థాయిలో పన్ను వసూళ్ళ చేసే సిబ్బంది ఎటువంటి అభ్యంతరాలు ఉన్నా వెంటనే రెవెన్యూ విభాగాధికారులకు తెలిజేయాలన్నారు. ఈ సమీక్షలో రెవెన్యూ అధికారి అబ్దుల్ జబ్బార్, రెవన్యూ ఇన్‌స్పెక్టర్ శివరామకృష్ణ ఉన్నారు. పురపాలక సంఘ పరిధిలోని పలువార్డులలో జరుగుతున్న శానిటేషన్ పనులను తెల్లవారుజామున కమిషనర్ జి.రఘునాథరెడ్డి పరిశీలించారు. శ్రీకన్యకాపరమేశ్వరి దేవస్థానం వద్ద పారిశుధ్య కార్మికుల హాజరుపట్టీని తనిఖీ చేసి వారికి పలు సూచనలు చేశారు. అనంతరం సూర్యలంక రోడ్డులోని అన్నక్యాంటీన్‌ను పరిశీలించి ఆహార, రుచి నాణ్యతను నేరుగా ప్రజలను అడిగి తెలుసుకున్నారు. వారి వెంట శానిటరీ ఇన్‌స్పెక్టర్‌లు సీహెచ్ కరుణ, డి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

కుక్కల దాడిలో చిన్నారికి తీవ్రగాయాలు



పాప తలకు అయిన గాయం

బాపట్ల, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): కుక్కల దాడిలో చిన్న పాప తలకు తీవ్రగాయమైన ఘటన గురువారం జరిగింది. బాపట్ల పట్టణం 11వవార్డు దేవుని మాన్యంలో మూడేళ్ల చిన్న పాప ఆడుకుంటున్న సమయంలో కుక్కలు ఒక్కసారిగా దాడి చేయటంతో పాప తలకు తీవ్ర గాయమవ్వడంతో ఏరియా వైద్యశాలకు తరలించి కుటుంబసభ్యులు చికిత్స చేయించారు. దేవుడి మాన్యంలో కుక్కలబెడద ఎక్కువగా ఉందని స్థానిక ప్రజలు వాపోతున్నారు. ఇలాంటి సంఘటనలు మరలా పునరావృతం కాకుండా సంబంధిత మున్సిపల్ అధికారులు చర్యలు తీసుకోవాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

రోడ్డుభద్రతా మాసోత్సవాల్లో డ్రైవర్లకు సన్మానం



ప్రమాదరహిత డ్రైవర్లకు సన్మానం చేస్తున్న అధికారులు, పోలీసులు

బాపట్ల, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): బాపట్ల కొత్తబస్టాండ్ నందు 36వ జాతీయ రోడ్డుభద్రతా మాసోత్సవాల సందర్భంగా ప్రమాదరహిత డ్రైవర్లకు సన్మాన కార్యక్రమాన్ని బాపట్ల డిపో మేనేజర్ శ్రీమన్నారాయణ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా నెల్లూరు జోన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ నాగేంద్రప్రసాద్ పాల్గొని డ్రైవర్స్‌కు రోడ్డు భద్రత గురించి, ప్రమాదం జరిగితే కుటుంబాలకు జరిగే నష్టం గురించి తెలియజేశారు. అనంతరం అతిథులతో ప్రమాదరహిత డ్రైవర్లందరికీ శాలువాలు, ప్రశంసాపత్రాలు, నగదు బహుమతులతో ఘనంగా సన్మానించారు. అనంతరం కేంద్రీయ విద్యాలయ విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి ప్రశంసాపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో డీపీటీవో రవికాంత్, డీటీవో పరందామరెడ్డి, ఈడీ నాగేంద్రప్రసాద్, పట్టణ సీఐ రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కార్యకర్తలకు బోధన పద్ధతులపై శిక్షణ



అంగన్‌వాడీ కార్యకర్తల శిక్షణలో పాల్గొన్న సీడీపీవో విజయలక్ష్మి తదితరులు

కొల్లూరు, భట్టిప్రోలు, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థుల బోధనా పద్ధతులపై అంగన్‌వాడీ కార్యకర్తలకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. గురువారం కొల్లూరు, భట్టిప్రోలు మండలాల్లోని అంగన్‌వాడీ కార్యకర్తలకు పీపీ-1, పీపీ-2 బోధనా పద్ధతులపై నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో అమృతలూరు ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారి విజయలక్ష్మి పాల్గొని మాట్లాడుతూ శిక్షణలో పాటించవలసిన నియమాలు, శిక్షణ నుంచి ఆశించే అంశాలు, క్విజ్, బేస్‌లెస్ అసెస్‌మెంట్, పిల్లల స్వభావం, అభ్యాసంలో మెదడు అభివృద్ధిపై ప్రభావం చూపే అంశాలతో పాటు సపోర్టింగ్ ఆంధ్రాస్ లెర్నింగ్ ట్రాన్స్‌ఫర్‌మేషన్ గురించి మూడు రోజుల పాటు శిక్షణ ఇస్తామన్నారు. విద్య నాణ్యతను మెరుగుపరిచే లక్ష్యంతో ఆంధ్రప్రదేశ్‌లో ప్రపంచ బ్యాంకు ఆర్థిక సాయంతో ప్రభుత్వం సాల్ట్ అనే ప్రాజెక్టు చేపట్టిందన్నారు. ప్రాజెక్టు ముఖ్య ఉద్దేశ్యం ఆంధ్రప్రదేశ్‌లో 50లక్షల విద్యార్థుల అభ్యసన నాణ్యతను మెరుగుపరచమే అన్నారు. మూడు రోజుల పాటు నిర్వహించే శిక్షణలో ఆయా దశల్లోని పిల్లలకు బోధించే పద్ధతులు గురించి వివరించడం జరుగుతుందన్నారు. శిక్షణలో ఏసీడీపీవో విజయరాణి, సూపర్‌వైజర్ విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

మినుము పైరులో లాం ఫాం శాస్త్రవేత్తల పరిశీలన

అమృతలూరు, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): మినుము, పెసర పొలాలను లాంఫాం శాస్త్రవేత్తలు గురువారం పరిశీలించారు. విత్తన ఉత్పత్తి కోసం నిర్దేశించిన రైతులకు విత్తనాలను లాంఫాం నుంచి అందజేశారు. ఈ సందర్భంగా మినుము జీబీజీ 932, ఎల్‌జీజీ 600, 632 రకాల పెసర పంటలను శాస్త్రవేత్తలు జె.సతీష్, ఎన్ హరిసత్యనారాయణలు పంట పొలాలను క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. విత్తన నాణ్యతకు మరిన్ని సూచనలు అందించారు.

ఎమ్మెల్సీ అభ్యర్థి కేఎస్ లక్ష్మణ్‌రావును గెలిపించాలి

● సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు మణిలాల్



సమావేశంలో మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సీహెచ్ మణిలాల్

రేపల్లె, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి గుంటూరు జిల్లా తీరప్రాంతంలో నిరుద్యోగ యువకులు ఉపాధి కోసం పరిశ్రమల స్థాపన మీద శాసనమండలిలో గళం వినిపించటానికి ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక పెన్షనర్స్ మద్దతు ఇచ్చిన పీడీఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి కేఎస్ లక్ష్మణ్‌రావును గెలిపించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సీహెచ్ మణిలాల్ అన్నారు. గురువారం నిజాంపట్నం మండలం సీఐటీయూ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిజాంపట్నం మండలంలోని ఓటు హక్కు కలిగిన నిరుద్యోగ యువకులు ఎమ్మెల్సీ లక్ష్మణ్‌రావును బలపర్చాలని సూచించారు. కార్యక్రమంలో సీఐటీయూ నేతలు ప్రహ్లాద్, కె.రమేష్, డి.రత్నరాజు తదితరులు పాల్గొన్నారు.

బాపట్లలో ప్రచారం

బాపట్ల, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): కృష్ణా-గుంటూరు పట్టభద్రుల ఎమ్మెల్సీగా పోటీ చేస్తున్న లక్ష్మణరావును గెలిపించండంటూ సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు సీహెచ్ గంగయ్య పట్టభద్రులైన ఓటర్లను కోరారు. గురువారం ఉదయం బాపట్ల ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల క్రీడా మైదానంలో పీడీఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న లక్ష్మణరావును గెలిపించాలంటూ ప్రచారం నిర్వహించి కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు కొండయ్య, నూతలపాటి కోటేశ్వరరావు, రంగారెడ్డి, కళాధర్, అనీల్, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

నాగేశ్వరరావు సేవలు అభినందనీయం

వేమూరు, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): వేమూరు గ్రామ పంచాయతీ అభివృద్ధిలో తనదైన ముద్ర వేసుకున్న గ్రామ పంచాయతీ జూనియర్ అసిస్టెంట్ చేబ్రోలు నాగేశ్వరరావు అభినందనీయులని ఈవోపీఆర్‌డీ సీహెచ్ శేఖర్ తెలిపారు. గురువారం వేమూరు గ్రామ పంచాయతీ జూనియర్ అసిస్టెంట్‌గా పని చేసి పదవీ విరమణ పొందిన చేబ్రోలు నాగేశ్వరరావుకు అభినందన సభ జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐదున్నర సంవత్సరాలుగా వేమూరు గ్రామ పంచాయతీలో అభివృద్ధి కార్యక్రమాల అమలుకు ఆయన ఎంతగానో కృషి చేశారని గుర్తు చేశారు.

స్కూల్ కాంప్లెక్స్‌లు పాత పద్ధతిలోనే కొనసాగించాలి

● ఆపస్ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసకుమార్



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాసకుమార్

వేమూరు, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): విద్యాశాఖ డైరెక్టర్ స్కూల్ కాంప్లెక్స్ విధానంలో మార్పులు తెస్తూ చేసిన ప్రకటనలు సరైనవి కాదని పాత పద్ధతిలోనే కొనసాగించాలని బాపట్ల ఆపస్ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసకుమార్ కోరారు. గురువారం ఆయన జంపని హైస్కూల్లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ విద్యాశాఖ డైరెక్టర్ విజయరామరాజు ప్రతినెల 3వ శనివారం స్కూల్ కాంప్లెక్స్‌లు నిర్వహిస్తారని ప్రకటించడంతో పాటు ఆ రోజు మధ్యాహ్నం నుంచి పాఠశాలల్లో పిల్లలను వదిలి వేయాలని చెప్పడం సమంజసంగా లేదన్నారు. ఈ విధంగా చేయడం వల్ల తల్లిదండ్రుల వ్యతిరేకత పెరిగి ప్రైవేట్ పాఠశాలల్లో బలపడే అవకాశం ఉంటుందన్నారు. దీనిపై ప్రభుత్వం పునరాలోచన చేయాల్సిన అవసరం ఉందన్నారు. పాఠశాల స్థాయి నుంచి కాంప్లెక్స్ పాఠశాలకు చేరుకోవడానికి చాలా సమయం పడుతుంది. ఉదయం 11.30 గంటలకు భోజనం పెట్టి 1 గంటకు స్కూల్ కాంప్లెక్స్ చేరుకోవడం కూడా చా లా కష్టమైన పని అవుతుంది. ఈ విషయాలను ఆలోచించి స్కూల్ కాంప్లెక్స్ విధానాన్ని పాత పద్ధతిలోనే జరిపించాలని కోరారు. సమావేశంలో సంఘ నాయ కులు రవిరాజు, పార్థసారధి, పోతురాజు పాల్గొన్నారు.

ఆడపిల్లల ప్రాధాన్యంపై అవగాహన కల్పించాలి : ఆర్డీవో గ్లోరియా

బాపట్ల, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి) : ఆడపిల్లల ప్రాధాన్యాన్ని గురించి వైద్య, ఆరోగ్యశాఖ సిబ్బంది, అంగన్‌వాడీ సిబ్బంది ప్రజలకు అవగాహన కల్పించాలని బాపట్ల ఆర్డీవో గ్లోరియా అన్నారు. గురువారం బాపట్ల ఆర్డీవో కార్యాలయం నందు పీసీపీఎన్‌డీటీ సబ్ డిస్ట్రిక్ మల్టీ మెంబరు అప్రాప్రియేటివ్ అథారిటి కమిటీ మీటింగ్ అండ్ సబ్ డిస్ట్రిక్ లెవల్ అడ్వయిజరీ కమిటీ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ స్కాన్ సెంటర్లను పక్కాగా తనిఖీ నిర్వహించాలని ప్రతి 5 సంవత్సరాలకు ఒకసారి రెన్యువల్ చేయించాలని పీసీపీ ఏఎన్‌డీటీ నిబంధనలకు విరుద్ధంగా ఎవరైన చర్యలకు పాల్పడినట్లయితే వారిపై కఠిన చర్యలు తప్పవని తెలిపారు. ఈ సమావేశంలో డాక్టర్ సౌజన్య, ఎన్‌సీడీపీవో డాక్టర్ బ్రహ్మం, వైద్యులు, రూరల్ సీఐ పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి సీఎం రిలీఫ్ ఫండు చెక్కు



పిట్టలవానిపాలెం, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కోడూరు గ్రామ పంచాయతీకి చెందిన కన్నెగంటి అరుణ కుమారికి ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా మంజూరైన రూ. 2లక్షల50వేల46లు చెక్కును నియోజకవర్గ టీడీపీ కార్యాలయం నందు బుధవారం ఎమ్మెల్యే నరేంద్రవర్మ బాధిత కుటుంబానికి అందజేశారు. కార్యక్రమంలో కోడూరు గ్రామసర్పంచ్ ఐనంపూడి శ్రీనివాసరావు, కోమలి సొసైటీ మాజీ అధ్యక్షుడు ఉయ్యూరి వెంటేశ్వరరావు, టీడీపీ గ్రామ అధ్యక్షుడు జాలాది వెంకటఅశోక్ పాల్గొన్నారు.

వైభవంగా శ్రీషిరిడీ సాయిబాబా మందిర వార్షికోత్సవం

బాపట్ల, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): బాపట్ల పట్టణం కొత్తబస్టాండ్ సమీపంలో గల శ్రీషిరిడిసాయిబాబా దేవాలయం 29వ ప్రతిష్ఠ వార్షికోత్సవం ఎంతో వైభవంగా జరిగింది. ఉదయం ఆఖండ దీపస్థాపన కంచర్లపల్లి రామాంజనేయులు రాజ్యలక్ష్మీ దంపతులతో ఆఖండ స్థాపన, ఆఖండనామసప్తహం కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఎమ్మెల్యే వేగేశన పాల్గొని శ్రీషిరిడిసాయినాధునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆదివారం కుంకుమార్చన, లలిత సహస్ర నామం, సోమవారం మహన్యాసపూర్వక రుద్రాభిషేకం, మంగళవారం లక్షతులసీ దళార్చన, బుధవారం కర్పూరహారతి ప్రత్యేక అభిషేకం, మధ్యాహ్నాహారతి, నారాయణసేవ (అన్నసంతర్పణ) అనంతరం బాబా నగరోత్సవం జరుగునని బాపట్ల శ్రీషిరిడీ సాయిబాబా సేవాసమితి సభ్యులు తెలిపారు.

స్వచ్ఛతా దివస్‌ను విజయవంతం చేయాలి

● డీఎల్‌పీవో కేజీఎస్ శ్రీనివాసన్



చెరుకుపల్లిలోని ఎస్‌డబ్ల్యూపీసీ షెడ్స్‌ను పరిశీలిస్తున్న డీఎల్‌పీవో కేజీఎస్ శ్రీనివాసన్

చెరుకుపల్లి, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): స్వచ్ఛభారత్ మిషన్‌లో భాగంగా ప్రతి నెలా మూడో శనివారం స్వచ్ఛతాదివస్‌గా పాటిస్తున్నారు. శనివారంను ఈనెల థీమ్ సోర్స్-రీసోర్స్‌గా నిర్ణయించారని డీఎల్‌పీవో కేజీఎస్ శ్రీనివాసన్ ఒక ప్రకటనలో తెలిపారు. దీనికి కార్యాచరణగా ఆఫీస్ క్లీన్‌నెస్, ప్లాంటేషన్ క్యాంపెయిన్, స్పెషల్ శానిటేషన్ కార్యక్రమాలను మండలంలోని అన్ని గ్రామపంచాయతీల్లో చేసి ఆ కార్యక్రమాల వివరాలను మండల పరిషత్ గ్రూపులో, ఎస్ఏఎస్ఏ ఏపీపీలో కూడా తప్పనిసరిగా నమోదు చేయాలన్నారు. అలాగే ఎస్‌డబ్ల్యూపీసీ షెడ్లు ఈ నెల 15వ తేదీ నాటికి అన్ని గ్రామపంచాయతీల్లో పూర్తిస్థాయిలో పనిచేసే విధంగా చేయాలన్నారు. ఈ కార్యక్రమాలను పర్యవేక్షించడానికి జిల్లా గ్రామపంచాయతీ అధికారి, కమిషనర్ ఆఫ్ పంచాయతీరాజ్‌శాఖ నుంచి ఒక టీమ్ వస్తారన్నారు. గ్రామ పంచాయతీ కార్యదర్శులు అందరూ స్వచ్ఛత దివస్ కార్యక్రమాలు, ఎస్‌డబ్ల్యూపీసీ షెడ్స్‌ను పూర్తిస్థాయిలో నిర్వహణలోకి తీసుకువచ్చి ఈ కార్యక్రమాలను విజయవంతం చేయాలన్నారు.

ఆలపాటి విజయం కోరుతూ ప్రచారం



కుచ్చెళ్లపాడులో ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న సర్పంచ్, టీడీపీ నాయకులు

వేమూరు, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): గుంటూరు కృష్ణా జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల కూటమి అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్ విజయాన్ని కోరుతూ గురువారం సాయంత్రం మండలంలోని కుచ్చెళ్లపాడు గ్రామంలో టీడీపీ శ్రేణులు ప్రచారం నిర్వహించారు. గ్రామసర్పంచ్ గాజుల వెంకటసుబ్బయ్య, టీడీపీ బీసీ సంఘం నేత తులం రమేష్‌బాబు గ్రామంలోని గ్రాడ్యుయేట్ ఓటర్లను కలిసి ఆలపాటి రాజేంద్రప్రసాద్‌కు మొదటి ప్రాధాన్యం ఓటు వేయాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో నాయకులు పెరికల పోతురాజు, విజయేంద్ర, ఆంజనేయులు, సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారిణి నాగిడి గాయత్రికి సత్కారం



విద్యార్థిని నాగిడి గాయత్రిని సన్మానిస్తున్న కళాశాల కరస్పాండెంట్ బుచ్చియ్యచౌదరి

నగరం, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): జాతీయ క్రీడల్లో బంగారు పతకం సాధించిన నాగిడి గాయత్రిని గురువారం వెలగపూడి రామకృష్ణ కళాశాలలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా కళాశాల సెక్రటరీ కరస్పాండెంట్ బుచ్చియ్యచౌదరి గాయత్రికి రూ.50వేలు నగదు అందజేశారు. ట్రెజరర్ వెంకటేశ్వరరావు రూ.పదివేలు ప్రోత్సాహకంగా ఇచ్చారు. ఈ సందర్భం గా కళాశాల ప్రిన్సిపాల్ హరికృష్ణ మాట్లాడుతూ జాతీయ స్థాయిలో గోల్డు మెడల్ సాధించటం కళాశాలకు గర్వకారణమని ఈ కళాశాల ఖ్యాతిని మరింత పెంచుతుందని అన్నారు. కార్యక్రమంలో కళాశాల అకాడమిక్ డైరెక్టర్ వీవీ వెంకటేశ్వరరావు, పి.శ్రీనివాసరావు, కళాశాల సూపరింటెండెంట్ పి.అమరేష్‌రెడ్డి, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

3, 4, 5 తరగతుల విలీనాన్ని ఆపాలి

● ఎస్‌టీయూ జిల్లా అధ్యక్షుడు బడుగు శ్రీనివాస్

బాపట్ల, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి) : 117 జీవో సవరణ ఉత్తర్వుల పేరుతో గ్రామాల్లోని ప్రాథమిక పాఠశాలలను నిర్వీర్యం చేసే విధంగా ప్రభుత్వం తెరతీయటం శోచనీయమని రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షుడు బడుగు శ్రీనివాస్ అన్నారు. మోడల్ ప్రాథమిక పాఠశాలలు ఏర్పాటు చేయటం స్వాగతించదగ్గ విషయమే అయినప్పటికీ దాని కోసం ఎస్సీ, ఎస్టీ, బడుగు బలహీన వర్గాలకు చెందిన పిల్లలు చదువుతున్న ప్రాథమిక పాఠశాలలోని 3, 4, 5 తరగతులను మోడల్ పాఠశాలలో విలీనం చేయటం వల్ల పాఠశాల దూరం పెరగటం ద్వారా బడుగు, బలహీన వర్గాలను చదువులకు దూరం చేయటమేనన్నారు. ఈ సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి గుడివాడ అమర్‌నాథ్, జిల్లా కన్వీనర్ వీవీ నాగరాజు, రాష్ట్ర కౌన్సిలర్ ఉదయశంకర్, జిల్లా అదనపు ప్రధాన కార్యదర్శి నూరుబాషా సుభానీ, ఆర్థిక కార్యదర్శి బొంతా వెంకటేశ్వర్లు, గవిని శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



అగ్గి రేగితే... బుగ్గే

● మిర్చియార్డులో యథేచ్ఛగా ధూమపానం

● పట్టించుకోని అధికారులు



మిర్చియార్డులో సిగరెట్లు కాలుస్తున్న హమాలీలు, వ్యాపారులు

గుంటూరు, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): నిత్యం వందల కోట్ల రూపాయల విలువ చేసే రైతుల మిర్చి టిక్కీలు దిగుమతి జరుగుతున్న మిర్చియార్డులో ప్రమాదకరమైన పరిస్థితులు నెలకొన్నాయి. కొంతమంది వ్యాపారస్థులు, గుమాస్తాలు, హమాలీలు, దొడ్డి కాపలాదారులు యథేచ్ఛగా ధూమపానం చేస్తున్నారు. అలా చేయడం ఎంతో ప్రమాదకరమని తెలిసినప్పటికీ అధికార యంత్రాంగం నియంత్రణ చర్యలు చేపట్టడం లేదు. బ్లాకుల వారీగా సూపర్‌వైజర్లు, సెక్యూరిటీ గార్డులున్నప్పటికీ వారించడం లేదు. ఈ నేపథ్యంలో మిర్చియార్డులో ఎప్పుడు ఎలాంటి అగ్నిప్రమాదం సంభవిస్తుందోనన్న ఆందోళనకరమైన వాతావరణం నెలకొన్నది. రోజుకు లక్షన్నర మిర్చి టిక్కీల వరకు దిగుమతి అవుతున్న ప్రస్తుత తరుణంలో ఏదైనా జరిగితే వెంటనే మంటలను అదుపు చేయడం కూడా అగ్నిమాపక శకటాలకు సాధ్యం అయ్యే పని కాదు. అదే జరిగితే రూ.వందల కోట్లలో అటు రైతులకు, ఇటు మార్కెటింగ్ శాఖకు నష్టం వాటిల్లే అవకాశం ఉన్నది.

మిర్చియార్డు సుమారు 30 ఎకరాలకు పైగా విస్తీర్ణంలో ఉన్నది. ప్రస్తుతం సీజన్ కావడంతో రాయలసీమ, ప్రకాశం జిల్లాల నుంచి రైతులు మిర్చిని అమ్ముకొనేందుకు యార్డుకు లారీలలో తీసుకొస్తున్నారు. కమీషన్ దుకాణాల్లో టిక్కీలు నిండిపోతుండటంతో అంతర్గత రోడ్లపై షాపుల ఎదురుగా దిగుమతి చేస్తున్నారు. ఉదయం పూట యార్డు కిక్కిరిసిపోయి ఉంటున్నది. ట్రేడింగ్ జరిగి కాటాలు అయిపోయిన తర్వాత సాయంత్రానికిగాని ఖాళీ అవడం లేదు. ఈ పరిస్థితుల్లో ఎంతో అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉన్నది. అయితే యార్డులోకి యథేచ్ఛగా సిగరెట్లు, లైటర్లు, అగ్గిపెట్టలతో వచ్చేవారిని లోపలికి అనుమతిస్తున్నారు. కనీసం ఎలాంటి చెకింగ్‌లు కూడా జరగడం లేదు. ఇలాంటి నిర్లక్ష్యమే 2008లో రైతులు, మార్కెటింగ్ శాఖ, వ్యాపారస్థుల పాలిట శాపమైంది.

అప్పట్లో మిర్చి సీజన్ ముగింపు దశకు చేరుకొన్న తరుణంలో ఒక్కసారిగా అగ్నిప్రమాదం సంభవించింది. నిమిషాల వ్యవధిలో మంటలు కమీషన్ దుకాణాలకు వ్యాపించి చుట్టుముట్టేశాయి. ఆ ప్రమాదంలో రూ.కోట్ల నష్టం జరిగింది. అప్పట్లో మిర్చి ధర చాలా తక్కువగా ఉన్నది. ఇప్పుడు క్వింటాల్ రూ.12వేలకు పైగా ఉన్నది. ఈ పరిస్థితుల్లో ఏమైనా ప్రమాదం జరిగితే రూ.వందల కోట్ల నష్టం వాటిల్లుతుంది. మార్కెటింగ్ అధికారులు ఎంతసేపటికి యార్డులో పర్యటిస్తూ భోజన శాల, విశ్రాంతి గదులు, కమీషన్ దుకాణాలను పరిశీలిస్తున్నారే తప్పా ధూమపానం చేస్తున్న వారిని పట్టించుకోవడం లేదు. ఈ నేపథ్యంలో అవసరమైన తాత్కాలిక సిబ్బందిని నియమించి అయినా సరే యార్డులోకి సిగరెట్లు, అగ్గిపెట్టెలు, లైటర్లు వంటివి తీసుకురాకుండా చూడాలి. అలానే లోపల ఉన్న దుకాణాల్లో సిగరెట్ల వంటివి విక్రయించకుండా నిరోధించాలి.

పశుపోషకులకు పాడి పాఠాలు

● నాలుగు జిల్లాల పాల రైతులకు గుంటూరులో శిక్షణ

● ఉత్పత్తి ఖర్చు తగ్గించడం.. పాలరేటు పెంచటమే లక్ష్యం



ప్రసంగిస్తున్న జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి నరసింహారావు

గుంటూరు సిటీ, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): గ్రామీణాభివృద్ధిలో కీలకమైన పాత్ర పోషించే పాడి పరిశ్రమకు కొత్త జీవం పోసేందుకు కూటమి ప్రభుత్వం సన్నద్ధం అయింది. అందులో భాగంగా పశుపోషకులకు ప్రత్యేకంగా పాఠాలు చెప్పించేందుకు రంగం సిద్ధం చేసింది. గుంటూరులోని ప్రాంతీయ పశుసంవర్ధక శిక్షణా కేంద్రంలో నాలుగు జిల్లాల పాల రైతులకు ప్రత్యేక శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నారు. గుంటూరు, కృష్ణ, ప్రకాశం, నెల్లూరు జిల్లాలకు చెందిన పాల రైతులకు పశుపోషణ, మెలకువలపై జనవరి నుంచి శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి ఓ.నరసింహారావు తెలిపారు. ఇప్పటి వరకు 70 మంది రైతులు ఈ శిక్షణలో పాల్గొన్నారని తెలిపారు. 10 కంటే ఎక్కువ పాడి పశువులు కలిగిన రైతులను పిలిపించి మూడు రోజుల పాటు శిక్షణ ఇస్తున్నట్లు వెల్లడించారు. పాల ఉత్పత్తి ఖర్చు తగ్గించడం, పాల ధర పెంచటం తద్వారా పాడి రైతును ఆర్థికంగా బలోపేతం చేసే విధంగా శిక్షణ తరగతులు జరుతున్నాయని తెలిపారు. మూడు రోజుల శిక్షణలో భాగంగా రైతులను డైరీ ఫామ్‌లకు తీసుకువెళ్లటం, బ్యాంకర్లతో కూడా ప్రత్యేక సమావేశం నిర్వహిస్తున్నట్లు నరసింహారావు తెలిపారు. మొత్తంగా పాడి రైతుకు అన్ని విధాలా ప్రోత్సాహం కల్పించి గ్రామాలను ఆర్థికంగా తిరుగులేని స్థితికి తీసుకువెళ్లటమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యం అని చెప్పారు.

చాలా విషయాలు తెలిశాయి..



చాలా కాలం నుంచి పశుపోషణలో ఉన్నాయి. పాల ఉత్పత్తి పెంచటంలో పెద్దగా మెలకువలు తెలియదు. ఈ శిక్షణ వలన నాకు చాలా విషయాలు తెలిశాయి. వంద రోజుల్లోపు గేదె గర్భం దాల్చేలా చూడటం ఎంత ముఖ్యమో ఇక్కడ తెలుసుకున్నాను. ఇవి తెలియక ఇన్నాళ్లు చాలా నష్టపోయాం. ప్రభుత్వం మాకు ఉపకరించే కార్యక్రమం ఏర్పాటు చేసింది.

- వల్లపుదాసు లక్ష్మణరావు, పెద్దవరం, నగరం మండలం

పాడి పరిశ్రమకు అండ...



నాకు 10 పాడి గేదెలు ఉన్నాయి. స్వయంగా పోషణ తయారు చేసుకోవటం ఎలానో ఇక్కడ నేర్పించారు. ఇన్నాళ్లు ఈ విషయాలు తెలియక పాల ఉత్పత్తికి అయ్యే ఖర్చు బాగా పెరిగిపోయి మాకు మిగిలింది ఏమీ లేకుండా పోయింది. డైరీ ఫామ్‌కు కూడా తీసుకువెళ్లారు. అక్కడ కొన్ని మెలకువలు నేర్చుకున్నాం.

- పత్రా నాగలింగం, పెదపరిమి, తుళ్లూరు మండలం

గతంలో ఇటువంటి శిక్షణ జరగలేదు



ఇప్పటికి నాలుగు జిల్లాలకు చెందిన 70మంది రైతులు ఈ శిక్షణలో పాల్గొన్నారు. గతంలో ఇటువంటి శిక్షణ ఎప్పుడూ జరగలేదు. మొట్టమొదటిసారి ప్రభుత్వం పాడిరైతుల కోసం భారీ కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. రైతులు ఎన్నో విషయాలు తెలుసుకునేందుకు అవకాశం ఏర్పడింది. బ్యాంకులకు వెళ్లి రుణాలు ఎలా పొందాలో కూడా తెలియజేయడం వలన రైతుకు చాలా ప్రయోజనం కలుగుతుంది. ఒక లీటరు పాల ఉత్పత్తికి అయ్యే ఖర్చు ఎలా తగ్గించాలో ఇక్కడ నేర్పించాం.

- శ్రీనివాస్, ఏడీ, ప్రాంతీయ పశు శిక్షణా సంస్థ

ప్రేమానుబంధం

(5వ పేజీ తరువాయి)

ధ్రువాలుగా మారిపోతున్నారు. సినిమాల్లో చూపించే ప్రేమ సన్నివేశాలను చూసి వాటినే ప్రేమని భ్రమించి చిన్నారులు కూడా తప్పుదారి పడుతున్నారు. బాల్యంలో ఏర్పడే నిర్మలమైన, నిష్కల్మషమైన ఇష్టాన్ని ఈ అపసవ్య ప్రేమలు ఆక్రమిస్తున్నాయి. ఫలితంగా స్కూలు వయసులోనే చిన్నారులు ప్రేమ వలలో చిక్కి విలవిలలాడుతున్నారు.

లక్ష్యాల ఛేదనతోనే ప్రేమ గమ్యం!

చదువుకునే వయసులో ప్రేమలో పడితే ఇక జీవితం అంతే! ప్రేమ మాధుర్యాన్ని ఆస్వాదనలో మునిగిపోతే భవిష్యత్తు అంధకారమే! అందుకే ప్రేమ అనే గమ్యస్థానం చేరాలనుకునే యువకులు ఎన్నో లక్ష్యాలను ఛేదించుకుంటూ ముందుకు సాగాలి. తొలిగా జీవితాన్ని గెలవాలి. అందుకోసం తనకు తానుగా నిర్ణయించుకున్న లక్ష్యాన్ని చేరుకోవాలి. ఒక వేళ ప్రేమలో పడినా.. దాన్ని జీవితాన్ని నిర్మించుకునే ప్రస్థానంగా మలుచుకోవాలి. యువతరం.. నవతరం.. తమ లక్ష్యాలను ఛేదించుకుంటూ.. ప్రేమ గమ్యస్థానం చేరుకోవాలి.

22 ఏళ్లు ప్రేమమయం..

ప్రేమకు మూడు సూత్రాలు అనివార్యం. అభిప్రాయాలకు విలువ ఇచ్చుకుని గౌరవించుకోవడం.. ఒకరిని ఒకరు అర్థం చేసుకోవడం.. ఒకరి పట్ల ఒకరు ఓపికగా వ్యవహరించడం.. ఈ మూడూ ఉంటేనే ఆ ప్రేమ బతుకుతుంది. తల్లిదండ్రులు- బిడ్డల మధ్య ఈ మూడు అంశాలు స్పష్టంగా ఉంటాయి. అందుకే ఎన్ని ఇబ్బందులు వచ్చినా ఆ అనుబంధం తెగిపోదు. ప్రతి ఒక్కరి జీవితంలో ఫస్ట్ లవ్ అనేది వారి తల్లి దండ్రుల వద్దే మొదలవుతుంది. అది నిస్వార్థమైన ప్రేమ. యువతీ యువకుల మధ్య ఉండే ప్రేమ కూడా అలా ఉండాలి. 2003లో దగ్గరైన మేము 2005లో ఒక్కటయ్యాం! ఆనాటి నుంచీ ఈనాటి వరకూ మా 22 ఏళ్ల పయనం ఎన్ని ఆటంకాలు వచ్చినా ప్రేమమయంగానే సాగింది. రెండు దశాబ్దాల మా పయనంలో అపోహలు, అపార్థాలు రాకుండా ఉంటాయా? కానీ వాటిని ఓపికతో అర్థం చేసుకుని పరిష్కరించుకుంటూ ముందుకు సాగాం. కుల సమస్య కావచ్చు, ఆర్థిక సమస్యలు కావచ్చు.. పెద్దల అయిష్టత కారణంగా మా కుటుంబాల నుంచి తొలినాళ్లలో ఎదురైన ఇబ్బందులు కావచ్చు.. ఓపికతో ఎదుర్కొన్నాం. జీవితంలో ఎదురైన ప్రతీ కష్టం మా బంధాన్ని మరింత ఘాడపరిచింది.



- గల్లా మాధవి, రామచంద్రరావు

మారుతోన్న అభిప్రాయం



గతంతో పోలిస్తే యువతలో ప్రేమపై అభిప్రాయం మారుతోంది. పూర్తిగా కంఫర్ట్ జోన్‌లో ఉండాలనుకుంటున్నారు. దీని కోసం కుటుంబ బంధాలను కూడా కాదనుకుంటున్నారు. తల్లి దండ్రుల నుంచి వచ్చే ఫిర్యాదులలో ఎక్కువశాతం సోషల్ మీడియాకు సంబంధించినవే ఉంటున్నాయి. మనం కోరుకున్నది మన చెంతకు చేరాలంటే కెరీర్‌పరంగా, కుటుంబ పరంగా అందరి ఆమోదం అవసరమే. కాకపోతే గతంతో పోలిస్తే ప్రేమ విషయంలో కుల, మతాల పట్టింపుల విషయంలో తల్లిదండ్రుల ఆలోచనాతీరు మారుతుండడం శుభపరిణామం

-షేక్. నజీర్, బాపట్ల ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్

మంచి.. చెడు రెండూనూ



ప్రేమ అనేది రెండు వైపులా పదును ఉన్న ఆయుధం వంటిది. పూర్తి స్థాయిలో ఒకరికొకరు అర్థం చేసుకుంటే బాగుంటుంది. ఉదాహరణకు ఓ చెడ్డ అలవాటును ఎవరు చెప్పినా మార్చుకోని వ్యక్తి ప్రేమ వల్ల దానికి దూరంగా జరగవచ్చు. కెరీర్‌లో ఎదగడానికి తనే ప్రేరణగా ఉండవచ్చు. కానీ ఇదే సమయంలో అమ్మాయి తిరస్కరిస్తే జీవితమే లేదనుకుని చెడు వ్యసనాలకు బానిసవుతున్న వారు ఎందరో ఉన్నారు.

-డి. కార్తీక్, ఈసీ ఫైనలియర్ స్టూడెంట్

రెండూ బ్యాలెన్స్ చేసుకోగలగాలి



చదువుకునే వయసులో ప్రేమలో పడడం తప్పేమికాదు. కాకపోతే రెండింటిని బ్యాలెన్స్ చేసుకునే పరిపక్వత ఉండాలి. అదే సమయంలో తల్లిదండ్రులను ఒప్పించే ఏ విషయంలో అయినా ముందడుగు వేయాలి. ఒకరి అభిప్రాయంతో మరొకకు ఏకీభవించాల్సిన అవసరమేమి లేదు. ఎదుటి వారి ఇష్టాయిష్టాలను కూడా గౌరవించాలి

-ఎం. వందన, ఈఐఈ, ఫైనలియర్ విద్యార్థిని

ఆలపాటి గెలుపు కోసం పని చేయండి

● పొన్నూరు కార్యకర్తలతో మాజీమంత్రి దేవినేని

● వ్యక్తి కంటే పార్టీ ముఖ్యమన్న ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్ర



గుంటూరులోని పొన్నూరు నియోజకవర్గ టీడీపీ కార్యాలయంలో సమావేశమైన మాజీ మంత్రి దేవినేని, ఎమ్మెల్యే ధూళిపాళ్ల

గుంటూరు, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్సీ ఎన్నికల ఎన్‌డీఏ కూటమి అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్ గెలుపునకు కృషి చేయాలని పొన్నూరు నియోజకవర్గ క్యాడర్‌కు మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు పిలుపిచ్చారు. ఆలపాటి గెలుపును కాంక్షిస్తూ దేవినేని నేతృత్వంలో ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్ర అధ్యక్షతన గుంటూరులోని పొన్నూరు నియోజకవర్గ టీడీపీ కార్యాలయంలో గురువారం కార్యకర్తలతో సమన్వయ సమావేశం జరిగింది. ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థితో వ్యక్తిగతంగా, రాజకీయంగా తనకు ఎదురైన ఇబ్బందులు గురించి క్యాడర్‌కు ఈ సమావేశంలో ఎమ్మెల్యే ధూళిపాళ్ల వివరించారు. అయితే వ్యక్తి కంటే పార్టీ ముఖ్యం అనే అభిప్రాయంతో అభ్యర్థితో సంబంధం లేకుండా మాజీ మంత్రి దేవినేని ఉమ సమన్వయంతో పని చేయాలని కేడర్‌కు దిశా నిర్దేశం చేశారు. ధూళిపాళ్ళ కుటుంబం పార్టీ నిర్ణయాలకు ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటుందని నరేంద్ర స్పష్టం చేశారు. దేవినేని మాట్లాడుతూ తనకు సోదరుడు లాంటి నరేంద్రకి 30 ఏళ్లుగా మంచి అనుబంధం ఉన్నదని, ఆయన కుటుంబం పార్టీ స్థాపించిన దగ్గర నుంచి పార్టీ నిర్ణయాలకు కట్టుబడి ఉందని తెలిపారు. పార్టీ క్లిష్ట సమయాల్లో నిలబడి పార్టీ కోసం కష్టపడే నాయకులలో ముందుండే వ్యక్తి ధూళిపాళ్ల నరేంద్రకుమార్ అని అన్నారు. ఈ పరిస్థితుల్లో పొన్నూరు నియోజకవర్గంలో ఆలపాటి ఎన్నికల ప్రచారానికి మార్గం సుగమమైనట్లు తెలుస్తోంది.

మిర్చియార్డులో మౌలిక సదుపాయాలు కల్పించాలి

● మంత్రి అచ్చెన్నాయుడుకు మిర్చి కమీషన్ వ్యాపారస్థుల విజ్ఞప్తి



మంత్రి అచ్చెన్నాయుడుని కలిసిన మిర్చి కమీషన్ ఏజంట్స్ అసోసియేషన్ నాయకులు

గుంటూరు, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డులో మౌలిక సదుపాయాలు కల్పించాలని మిర్చి కమీషన్ ఏజంట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు దాది నరేంద్రబాబు రాష్ట్ర మార్కెటింగ్ శాఖ మంత్రి కే అచ్చెన్నాయుడుకు విజ్ఞప్తి చేశారు. గురువారం మంత్రి క్యాంపు కార్యాలయంలో అసోసియేషన్ నాయకులు కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నరేంద్రబాబు మాట్లాడుతూ యార్డు ప్రాంగణంలో పుష్కలంగా తాగునీరు అందుబాటులో ఉంచాలన్నారు. అలానే డ్రైనేజీని మెరుగుపరచాలని, స్ప్రింక్లర్లన్నీ పని చేసేలా చూడాలన్నారు. రైతులకు కనీస మద్దతు ధర కల్పించి రైతాంగాన్ని ఆదుకోవాలన్నారు. ఈ సందర్భంగా మంత్రి అచ్చెన్నాయుడు స్పందిస్తూ గుంటూరు మిర్చి యార్డులో ఉన్న సమస్యలను త్వరలోనే పరిష్కరిస్తామన్నారు. అలానే మిర్చి రైతుల సమస్యలను సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని హామి ఇచ్చారు. మంత్రిని కలిసిన వారిలో అసోసియేషన్ సభ్యులున్నారు.

మొండి బకాయిలపై దాడులు

● కాకానిరోడ్డులో గోల్డెన్ టొబాకో కంపెనీ సీజ్

● మరికొన్నింటిపైనా చర్యలకు నగరపాలక సంస్థ సిద్ధం

● పన్నుల వసూళ్లలో నిర్లక్ష్యంపై జీఎంసీ కమిషనర్ చర్యలు

గుంటూరు కార్పొరేషన్, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): ఆస్తి పన్నులపై ఎట్టకేలకు నగర పాలక సంస్థ కఠిన చర్యలకు సిద్ధమైంది. ఏళ్లుగా పేరుకుపోయిన బకాయిల వసూళ్లపై అధికారులు దృష్టి సారించారు. అదే విధంగా పన్నుల వసూళ్లలో నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్న సిబ్బందిపైనా అధికారులు చర్యలు తీసుకున్నారు. మొండిబకాయిదారులకు ఇప్పటికే రెడ్ నోటీసులు జారీతో పాటు కుళాయి కనెక్షన్ తొలగింపు, విద్యుత్ సరఫరా నిలిపివేశారు. అయినా దారికిరాని మొండిబకాయిదారులపై నగర పాలక సంస్థ అధికారులు గురువారం ఏకంగా దాడులకు దిగారు. ఈ క్రమంలో రూ.1.63 కోట్ల ఆస్తి పన్ను బకాయి ఉన్న కాకాని రోడ్డులోని గోల్డెన్ టొబాకో కంపెనీకి గురువారం డిప్యూటీ కమిషనర్ తుమ్మల వెంకటకృష్ణయ్య, ఆర్‌ఐ సాధిక్‌బాష, షేక్ ఖాజావలి, సచివాలయ సిబ్బంది ముకుమ్మడిగా వెళ్లి తాళం వేసి సీజ్ చేశారు. ఆస్తి పన్ను వసూళ్లకు అధికారులతో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసినట్లు కమిషనర్ పులి శ్రీనివాసులు తెలిపారు.

ఏడుగురు కార్యదర్శుల సస్పెన్షన్..

గత వారం రోజుల్లో ఆస్తి పన్నులు వసూళ్లలో సున్నా ఫలితాలు సాధించిన ఏడుగురు అడ్మిన్ కార్యదర్శులను సస్పెండ్ చేస్తూ కమిషనర్ శ్రీనివాసులు గురువారం ఆదేశాలు జారీ చేశారు. అదేవిధంగా నలుగురు ఆర్‌ఐలకు షోకాజ్ నోటీసులు జారీ చేయాలని ఆదేశాల్లో పేర్కొన్నారు. ఆస్తి పన్ను వసూళ్లపై గురువారం కౌన్సిల్ సమావేశ మందిరంలో ప్రత్యేక సమావేశం జరగ్గా సచివాలయాల వారీగా ఉన్న డిమాండ్, గత వారం రోజుల వసూళ్ల వివరాలను కమిషనర్ తెలుసుకున్నారు. ఈ క్రమంలో అడ్మిన్ కార్యదర్శులైన ఎం నాగరాజు(14), డి.జయలక్ష్మి(7), ఎస్‌కేబీ అరుణ్‌కుమార్ (154), జె.పవన్ కుమార్(191), కె.కామేశ్వరరావు(163), షేక్ షబీన(40), జి.రేవంత్ నాగసాయి(60) పన్ను వసూళ్లలో తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శించినట్లు గుర్తించిన కమిషనర్ వారిని సస్పెండ్ చేయాలని ఆదేశించారు. వసూళ్లపై పర్యవేక్షణలో నిర్లక్ష్యం ప్రదర్శించిన ఆర్‌ఐలు ఖజావలి, కాశయ్య, సుబ్బారావు, నాగరాజులకు షోకాజ్ నోటీసులు జారీ చేయాలనీ అదనపు కమీషనర్‌ను ఆదేశించారు.



కాకాని రోడ్డులో గోల్డెన్ టొబాకో కంపెనీకి తాళాలు వేస్తున్న ఆర్‌ఐ షేక్ ఖాజావలి

వీవీఐటీకి 'ఏఐసీటీఈ ఐడియా ల్యాబ్'



ల్యాబ్ ధ్రువపత్రాలను చూపుతున్న అధ్యాపకులు, పక్కన వీవీఐటీ చైర్మన్ విద్యాసాగర్ తదితరులు

పెదకాకాని, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): ఆల్ ఇండియా కౌన్సిల్ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్ ప్రారంభించిన ప్రతిష్టాత్మక 'ఏఐసీటీఈ ఐడియా ల్యాబ్' (ఐడియా డెవలప్‌మెంట్ ఎవల్యూషన్ అండ్ అప్లికేషన్)ను వీవీఐటీ కళాశాలకు కేటాయించినట్లు వీవీఐటీ చైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్ గురువారం తెలిపారు. సాంకేతిక విద్యాసంస్థల్లో నాణ్యమైన విద్యాప్రమాణాలు, ఆవిష్కరణలకు చేస్తున్న కృషికి గుర్తింపుగా దేశవ్యాప్తంగా సాంకేతిక విద్యాలయాల్లో ఏఐసీటీఈ 113 ల్యాబ్‌లను ఏర్పాటుచేయనుండగా, అందులో వీవీఐటీ కళాశాల ఒకటని వివరించారు. ఈ ల్యాబ్ కోసం ఏఐసీటీఈ వీవీఐటీ కళాశాలకు రూ.90లక్షలు కేటాయించినట్లు పేర్కొన్నారు. సాంకేతిక విద్యలో అనుభవపూర్వక అభ్యాసం, వ్యవస్థాపకత, ఆవిష్కరణల రూపకల్పన దిశగా విద్యార్థులను ప్రోత్సహించడమే ఈ ల్యాబ్స్ ముఖ్యఉద్దేశం అన్నారు. రోబోటిక్స్, 3డీ ప్రింటర్స్, ఐఓటీ కిట్స్ వంటి అధునాతన సాంకేతిక సాధనాలు ఈ ల్యాబ్ ద్వారా విద్యార్థులకు అందుబాటులో ఉంటాయన్నారు. ఈ ప్రాజెక్ట్ చీఫ్‌మెంటర్‌గా ప్రిన్సిపాల్ డాక్టర్ వై. మల్లికార్జునరెడ్డి, కోఆర్డినేటర్‌గా డాక్టర్ ఎం.వై.భానుమూర్తి, కోఆర్డినేటర్‌గా డాక్టర్ టి.శ్రీనివాసరావు వ్యవహరించనున్నట్లు తెలిపారు.

విద్యార్థులు ఉన్నతస్థాయికి ఎదగాలంటే..



మాట్లాడుతున్న ఆచార్య మురళీకృష్ణ

గుంటూరు (విద్య) ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు జీవితంలో ఉన్నతస్థాయికి ఎదగాలంటే వ్యసనాలకు బానిసలు కాకూడదని కాకినాడ జేఎన్‌టీయూ వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ కె.వి.ఎస్.జి.మురళీకృష్ణ అన్నారు. చేబ్రోలు మండలం వడ్లమూడిలోని విజ్ఞాన్స్ లారా ఇంజనీరింగ్ కళాశాలలో "జాయ్ ఆఫ్ ఇంజనీరింగ్" అనే అంశంపై గురువారం రోజున మొదటి సంవత్సరం ఇంజనీరింగ్ విద్యార్థులకు అవగాహనా సదస్సు నిర్వహించారు. జేఎన్‌టీయూ వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ కేవీఎస్‌జీ మురళీ కృష్ణ మాట్లాడుతూ ప్రతి మనిషి జీవిత కాలం విద్యార్థిగా ఉండాలని, ఎల్లప్పుడు పుస్తకాలు చదవట ం అలవాటు చేసుకోవాలన్నారు. మరో ముఖ్యఅతిథిగా హాజరైన విజ్ఞాన్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ లావు రత్తయ్య మాట్లాడుతూ ప్రథమ సంవత్సరం చదువుతున్న విద్యార్థులు మొదటి నుంచే లక్ష్యాన్ని ఏర్పరచుకోవాలన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రధానాచార్యులు డాక్టర్ కె. ఫణీంద్రకుమార్, ఆయా విభాగాల డీన్లు, అధిపతులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కిచెన్ గార్డెన్లకు నిధులు

● 662 ఉన్నత పాఠశాలలకు రూ.13.13 కోట్లు

● ప్రధాన మంత్రి స్కూల్స్ రైజింగ్ ఇండియా పథకం కింద మంజూరు

తెనాలి అర్బన్, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): ప్రధాన మంత్రి స్కూల్స్ రైజింగ్ ఇండియా పథకంలో ఉన్నత పాఠశాలల్లో కిచెన్ గార్డెన్లు, రెయిన్ వాటర్ హార్వెస్టింగ్ కోసం నిధులు విడుదల చేశారు. రాష్ట్రంలోని 662 ఉన్నత పాఠశాలలకు రూ.13.13 కోట్లు కేటాయిస్తూ సమగ్ర శిక్ష ఎస్‌పీడీ ఈ నెల 5న ఉత్తర్వులు జారీ చేశారు. కిచెన్ గార్డెన్ ఏర్పాటు చేసేందుకు ప్రతి స్కూల్‌కు రూ.1.50 లక్షలు, రెయిన్ వాటర్ హార్వెస్టింగ్‌కు రూ.లక్ష కేటాయించారు. మధ్యాహ్న భోజన పథకంలో కూరగాయలు పాఠశాలల్లోనే పండించి వినియోగించేలా కిచెన్ గార్డెన్లు ఈ నిధులతో ఏర్పాటు చేసుకోవాలి. అదేవిధంగా ప్రతి పాఠశాల ప్రాంతంలో కురిసే వర్షపు నీరు, వాడుక నీరు భూమిలో ఇంకేలా ఇంకుడు గుంతలు ఏర్పాటు చేయాలి. ఇప్పటికే కొన్ని పాఠశాలల్లో ఈ పనులను ప్రారంభించారు. స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ ఆధ్వర్యంలో ప్రధానోపాధ్యాయులు పర్యవేక్షించేలా నిధుల వినియోగానికి ఎస్ఎస్ఏ అధికారులు విధి విధానాలను వివరిస్తున్నారు. గుంటూరు జిల్లాలో అంగలకుదురు, కొత్తపేట, కొల్లిపర, నారాకోడూరు, నల్లబాడు, రేవేంద్రపాడు, కాకుమాను, నూతక్కి, సిరిపురం, నంబూరు, పెదనందిపాడు, నిడుబ్రోలు, ప్రత్తిపాడు, ముట్లూరు, రావెల, తాడేపల్లి ఉన్నత పాఠశాలలకు ఫేజ్-1లో ఈ నిధులు మంజూరు అయ్యాయి.

నిధులు వెనక్కి ఇవ్వాలనే ఆదేశాలతో కలకలం

పాఠశాలల్లో అభివృద్ధి కోసం ఉన్న నిధులు వెనక్కి ఇవ్వాలని జిల్లా విద్యాశాఖల కార్యాలయాల నుంచి మౌఖిక ఆదేశాలు ఇవ్వడం పలుచోట్ల గత రెండు రోజులుగా కలకలం రేపుతోంది. వాస్తవానికి ప్రభుత్వం నాడు-నేడు పథకంలో వినియోగించుకోకుండా ఉన్న పాఠశాలల్లో నిధులను వెనక్కి ఇవ్వాలనే ఆదేశించింది. కానీ ప్రధాన మంత్రి స్కూల్ రైజింగ్ ఇండియా పథకం కింద కేటాయించిన నిధులు కూడా జిల్లా విద్యాశాఖాధికార యంత్రాంగం వెనక్కి ఇవ్వాలనడం, రాత పూర్వక ఆదేశాలు లేకుండానే మాట్లాడటంతో కొంతమంది ప్రధానోపాధ్యాయులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. మరి కొంత మంది జిల్లా అధికారులు చెప్పారు కదా అని పీపీఏలు క్రియేట్ చేసి జిల్లా కలెక్టర్ల అకౌంట్‌కు నిధులు వెనక్కి పంపుతున్నారు. దీనిపై ఎస్ఎస్ఏ, విద్యా శాఖాధికారులు ఓ స్పష్టమైన వైఖరికి రావాలని ప్రధానోపాధ్యాయులు కోరుతున్నారు.



పాఠశాలలో ఏర్పాటు చేసిన గార్డెన్

నాడు ఆర్భాటంగా జగనన్న కాలనీలు

- కనీస వసతులు కల్పించని వైసీపీ ప్రభుత్వం
- లబ్ధిదారులకు శాపంగా మారిన వైనం
- లక్షలు వెచ్చించి ఇళ్ల నిర్మాణాలు
- ఉండలేక.. వెళ్లలేక.. సతమతం

అద్దంకి, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి) : కొత్త కాలనీలు కాదు.. కొత్తగా ఊర్లే ఏర్పడుతున్నాయి... వైసీపీ ప్రభుత్వం హయాంలో ప్రతి ఒక్క నేత నుంచి వచ్చిన మాటలు... అయితే ఇప్పుడు ఆయా కాలనీలలో పరిస్థితులు గమనిస్తే కనీసం చిట్టడవులను తలపించేలా ఆయా కాలనీలు ఉన్నాయి. నాయకుల మాటలు నమ్మి ఇళ్ల నిర్మాణం చేసుకున్న లబ్ధిదారుల బిక్కుబిక్కు మంటూ గడపాల్సిన పరిస్థితి ఏర్పడింది. వైసీపీ ప్రభుత్వం ఎంతో ఆర్భాటంగా ఏర్పాటు చేసిన జగనన్న కాలనీలు... అప్పటి అధికారుల ఒత్తిడి తట్టుకోలేక ఇళ్ల నిర్మాణం చేసుకున్న లబ్ధిదారుల పరిస్థితి అగమ్య గోచరంగా మారింది. లక్షల రూపాయలు వెచ్చించి ఇళ్ళ నిర్మాణం చేసుకున్న లబ్ధిదారులు కనీస వసతులు కూడా లేకపోవటం తో అక్కడ ఉండలేక... అక్కడ ఇంటిని వదిలి మరలా అద్దంకి పట్టణంలోకి వచ్చి అద్దె ఇళ్లల్లోకి రాలేక సతమతమవుతున్నారు. అప్పట్లో అధికారులు, ప్రజా ప్రతినిధుల మాటలు నమ్మి నిలువునా మోస పోయామని లబ్దిదారులు లబోదిబో అంటున్నారు. అన్ని వసతులు కల్పన పూర్తయిన తరువాతనే లబ్ధిదారులు


అద్దంకి పట్టణ సమీపంలో వేలమూరిపాడు రోడ్డులో ఉన్న జగనన్న కాలనీలో రోడ్డు దుస్థితి

ఇళ్ల నిర్మాణం, గృహ ప్రవేశాలు జరుగుతాయని అధికారులు, ప్రజా ప్రతినిధులు చెప్పారు. ఆచరణలో మాత్రం పరిస్థితి వేరుగా మారింది. అధికారుల ఒత్తిడి తట్టుకోలేక లబ్ధిదారులు హడావుడిగా ఇళ్ల నిర్మాణం చేసుకున్నారు. అద్దంకి పట్టణంలో సుమారు 2వేల మంది లబ్ధిదారులకు బొమ్మనంపాడు రోడ్డు, వేలమూరిపాడు రోడ్డు, నాగులపాడు రోడ్డులలో లే అవుట్‌లు వేసి ఇళ్ల స్థలాలు కేటాయించారు. బొమ్మనంపాడు రోడ్డులో ఉన్న లేఅవుట్ అద్దంకి పట్టణానికి సుమారు 4కి.మీ దూరంలో ఉంది. సుమారు వెయ్యి మంది లబ్ధిదారులకు ప్లాట్లు కేటాయించారు. కనీస రవాణా వసతి కూడా లేదు. వర్షం పడితే కాలనీకి వెళ్లే పరిస్థితి కూడా లేదు. దీంతో ప్రస్తుతం 20 మంది లబ్ధిదారులు మాత్రమే నివాసం ఉంటున్నారు. దీంతో రాత్రి సమయంలో బిక్కు బిక్కు మంటూ గడుపుతున్నారు. అక్కడ ఉండలేక.... ఖాళీ చేసి రాలేక సతమతమవుతున్నారు. ఇక వేలమూరిపాడు, నాగులపాడు రోడ్డులలో ఉన్న లేఅవుట్‌లో ఎక్కువ మంది లబ్ధిదారులు నివాసం ఉంటున్నా కనీస వసతులు కల్పించలేదు. విద్యుత్ సౌకర్యం మినహా మిగిలిన ఎలాంటి కనీస వసతుల కల్పన జరగలేదు. కనీసం గ్రావెల్ రోడ్లు, సీసీ డ్రైన్‌లు, తాగునీటి వసతుల కల్పన కూడా లేకపోవడంతో నివాసం ఉంటున్న లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారు. చిన్నపాటి వర్షం పడ్డా కాలనీలలో నడిచే పరిస్థితి లేకుండా పోతుందని ఆందోళన చెందుతున్నారు. కనీసం సైడ్ డ్రైన్‌లు కూడా లేకపోవడంతో మురుగు ఇళ్ల ముందు నిలిచి పోతుంది. ఇక ఆయా కాలనీలకు వెళ్లే రోడ్లు కూడా అభివృద్ధికి నోచుకోలేదు. నాడు వైసీపీ పాలకులు చేసిన నిర్లక్ష్యం లబ్ధిదారులకు శాపంగా మారి ఇప్పటికీ నరకయాతన అనుభవించాల్సిన పరిస్థితి ఏర్పడింది. కొత్త గ్రామాలు కాస్తా చిట్టడవులుగా మారాయని లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారు.


నాగులపాడు రోడ్డులో ఉన్న జగనన్న కాలనీలో ఆనవాళ్లు కూడా లేని రోడ్డు, పెరిగిన చిల్లచెట్లు

కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత

ఎన్టీఆర్ కాలనీలుగా మార్పుతో సరి

సార్వత్రిక ఎన్నికలలో వైసీపీ ఓటమి చెంది కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న జగనన్న కాలనీల పేర్లనును ఎన్టీఆర్ కాలనీలుగా మార్పు చేశారు. అయితే ఆయా కాలనీలలో వసతుల కల్పనపై మాత్రం కూటమి ప్రభుత్వం ఇంకా దృష్టి పెట్టకపోవడంతో లబ్ధిదారుల పరిస్థితి అగమ్య గోచరంగా మారింది.

ఒక్కో ఇంటి నిర్మాణానికి సుమారు 10 లక్షల నుంచి 12 లక్షల రూపాయల వరకు ఖర్చు అయింది. అందులో ప్రభుత్వం నుంచి 1.80 లక్షల రూపాయలు మాత్రమే వచ్చాయి. మిగిలిన డబ్బులు అప్పులు చేసి ఇళ్ల నిర్మాణం చేసుకున్నారు. దీంతో లక్షల రూపాయలు వెచ్చించి కట్టుకున్న ఇంటిని వదిలి రాలేక, వసతుల లేమి మధ్య ఉండలేక ఇబ్బంది పడుతున్నారు. ఇప్పటికైనా కనీసం అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వమైనా ఆయా కాలనీలలో కనీస వసతుల కల్పనపై దృష్టి పెట్టాలని లబ్ధిదారులు కోరుతున్నారు.


అద్దంకి పట్టణం సమీపంలో బొమ్మనంపాడు రోడ్డులో జగనన్న కాలనీ వ్యూ (ఫైల్)

బర్డ్ ఫ్లూ భయం

- తగ్గిన చికెన్, రెస్టారెంట్‌లో విక్రయాలు
- వెలవెలబోతున్న దుకాణాలు, బోరుమంటున్న వ్యాపారులు


ఫౌల్ట్రీ ఫారం


వెలవెలబోయిన చికెన్‌షాప్

చీరాలటౌన్, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి) : ఇటీవల కాలంలో బర్డ్ ఫ్లూ ప్రచారం జోరందుకుంది. గతంలో నిత్యం రెస్టారెంట్‌లు, చికెన్ స్టాల్స్ విక్రయాలతో కళకళలాడేవి. నేడు ఆ పరిస్థితి లేదు. ప్రజల్లో భయాందోళన పెరిగిపోయింది. ఈక్ర మంలో చికెన్ వైపు చూడాలం టే ససేమిరా అంటూ భయపడుతున్నారు. అయితే దుకాణ దారులు వ్యాపారాలు లేక ఇంటి అద్దెలు, మెడికల్, ఈఎమ్ఐలతో సతమతమవుతున్నారు. గతంలో కోవిడ్ సమయంలో ఎందరో వ్యాపారులు కనమరుగయ్యారు. ఇప్పుడిప్పుడే అన్నీ సర్దుకున్నాయి. తాజాగా బర్డ్ ఫ్లూ కలకలం రేపుతుండడంతో బతుకుజీవుడా అంటున్నారు. ఒక్కో చిన్న చికెన్ షాపులో గతంలో 70-100 కేజీల చికెన్ విక్రయాలు జరిగేవి. అప్పట్లో ధర రూ.280, రూ.300 వరకు ఉంది. కానీ ప్రస్తుతం ధర రూ.200 ఉండగా 10-15 కేజీల విక్రయాలు జరపడం గగనంగా మారింది. మరోవైపు అధికారులు మన జిల్లాకు ప్రస్తుతం ఇబ్బంది లేదని, ప్రజలు భయపడాల్సిన అవసరం లేదని చెప్తున్నారు. కానీ ప్రజల్లో ఆందోళన నెలకొనడంతో వ్యాపారాలు వెలవెల బోతున్నాయి.

అప్పులతో వ్యాపారాలు చేస్తున్నాం



ఇప్పటికే అప్పులు తెచ్చి వ్యాపారాలు చేస్తున్నాం. షాపులు అద్దెలు కట్టాలి. కుటుంబ అవసరాలు ఉన్నాయి. ఈక్రమంలో వ్యాపారాలు తగ్గడంతో అయోమయంగా మారింది.

- సాధిక్, చికెన్ షాపు నిర్వాహకుడు

మొక్కల పెంపకంపై విద్యార్థుల్లో మక్కువ పెంచాలి

చీరాలటౌన్, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి) : మొక్కలు పెంపకంపై విద్యార్థుల్లో మక్కువ పెంచాలని అప్పుడే పర్యావరణంలో సానుకూల మార్పులు చోటుచేసుకుంటాయని రాష్ట్ర నేషనల్ గ్రీన్ కోర్ సంచాలకులు స్రవంతి అన్నారు. జిల్లా పర్యటనలో భాగంగా గురువారం నియోజకవర్గ పరిధిలోని పలు పాఠశాలలను ఆమె సందర్శించారు. ఈసందర్భంగా విద్యార్థులతో ముఖాముఖి నిర్వహించారు. ఎకో క్లబ్‌ల ద్వారా విద్యార్థులు పర్యావరణ పరిరక్షణ ప్రాజెక్టులకు సాధికారత కల్పిస్తామని చెప్పారు. పాఠశాలల ప్రాంగణాల్లోని మొక్కలను పరిశీలించి నీళ్లు పోశారు. కార్యక్రమంలో జిల్లా నేషనల్ గ్రీన్‌కోర్ కోఆర్డినేటర్ పవని భానుచంద్రమూర్తి, ప్రాజెక్టు అధికారి సత్యనారాయణ, ఎకో క్లబ్ కన్వీనర్‌లు, ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.


మొక్కలకు నీళ్లు పోస్తున్న రాష్ట్ర నేషనల్ సంచాలకులు స్రవంతి

ప్రేమానుబంధం

(5వ పేజీ తరువాయి)

ధ్రువాలుగా మారిపోతున్నారు. సినిమాల్లో చూపించే ప్రేమ సన్నివేశాలను చూసి వాటినే ప్రేమని భ్రమించి చిన్నారులు కూడా తప్పుదారి పడుతున్నారు. బాల్యంలో ఏర్పడే నిర్మలమైన, నిష్కల్మషమైన ఇష్టాన్ని ఈ అపసవ్య ప్రేమలు ఆక్రమిస్తున్నాయి. ఫలితంగా స్కూలు వయసులోనే చిన్నారులు ప్రేమ వలలో చిక్కి విలవిలలాడుతున్నారు.

లక్ష్యాల ఛేదనతోనే ప్రేమ గమ్యం!

చదువుకునే వయసులో ప్రేమలో పడితే ఇక జీవితం అంతే! ప్రేమ మాధుర్యాన్ని ఆస్వాదనలో మునిగిపోతే భవిష్యత్తు అంధకారమే! అందుకే ప్రేమ అనే గమ్యస్థానం చేరాలనుకునే యువకులు ఎన్నో లక్ష్యాలను ఛేదించుకుంటూ ముందుకు సాగాలి. తొలిగా జీవితాన్ని గెలవాలి. అందుకోసం తనకు తానుగా నిర్ణయించుకున్న లక్ష్యాన్ని చేరుకోవాలి. ఒక వేళ ప్రేమలో పడినా.. దాన్ని జీవితాన్ని నిర్మించుకునే ప్రస్థానంగా మలుచుకోవాలి. యువతరం.. నవతరం.. తమ లక్ష్యాలను ఛేదించుకుంటూ.. ప్రేమ గమ్యస్థానం చేరుకోవాలి.

22 ఏళ్లు ప్రేమమయం..

ప్రేమకు మూడు సూత్రాలు అనివార్యం. అభిప్రాయాలకు విలువ ఇచ్చుకుని గౌరవించుకోవడం.. ఒకరిని ఒకరు అర్థం చేసుకోవడం.. ఒకరిపట్ల ఒకరు ఓపికగా వ్యవహరించడం.. ఈ మూడూ ఉంటేనే ఆ ప్రేమ బతుకుతుంది. తల్లిదండ్రులు-బిడ్డల మధ్య ఈ మూడు అంశాలు స్పష్టంగా ఉంటాయి. అందుకే ఎన్ని ఇబ్బందులు వచ్చినా ఆ అనుబంధం తెగిపోదు. ప్రతి ఒక్కరి జీవితంలో ఫస్ట్ లవ్ అనేది వారి తల్లిదండ్రుల వద్దే మొదలవుతుంది. అది నిస్వార్థమైన ప్రేమ. యువతీ యువకుల మధ్య ఉండే ప్రేమ కూడా అలా ఉండాలి. 2003లో దగ్గరైన మేము 2005లో ఒక్కటయ్యాం! ఆనాటి నుంచీ ఈనాటి వరకూ మా 22 ఏళ్ల పయనం ఎన్ని ఆటంకాలు వచ్చినా ప్రేమమయంగానే సాగింది. రెండు దశాబ్దాల మా పయనంలో అపోహలు, అపార్థాలు రాకుండా ఉంటాయా? కానీ వాటిని ఓపికతో అర్థం చేసుకుని పరిష్కరించుకుంటూ ముందుకు సాగాం. కుల సమస్య కావచ్చు, ఆర్థిక సమస్యలు కావచ్చు.. పెద్దల అయిష్టత కారణంగా మా కుటుంబాల నుంచి తొలినాళ్లలో ఎదురైన ఇబ్బందులు కావచ్చు.. ఓపికతో ఎదుర్కొన్నాం. జీవితంలో ఎదురైన ప్రతీ కష్టం మా బంధాన్ని మరింత ఘాడపరిచింది.

- గళ్లా మాధవి, రామచంద్రరావు

మారుతోన్న అభిప్రాయం

గతంతో పోలిస్తే యువతలో ప్రేమపై అభిప్రాయం మారుతోంది. పూర్తిగా కంఫర్ట్ జోన్‌లో ఉండాలనుకుంటున్నారు. దీని కోసం కుటుంబ బంధాలను కూడా కాదనుకుంటున్నారు. తల్లిదండ్రుల నుంచి వచ్చే ఫిర్యాదులలో ఎక్కువశాతం సోషల్ మీడియాకు సంబంధించినవే ఉంటున్నాయి. మనం కోరుకున్నది మన చెంతకు చేరాలంటే కెరీర్‌పరంగా, కుటుంబ పరంగా అందరి ఆమోదం అవసరమే. కాకపోతే గతంతో పోలిస్తే ప్రేమ విషయంలో కుల, మతాల పట్టింపుల విషయంలో తల్లిదండ్రుల ఆలోచనాతీరు మారుతుండడం శుభపరిణామం

- షేక్. నజీర్, బాపట్ల ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్

మంచి.. చెడు రెండూనూ

ప్రేమ అనేది రెండు వైపులా పదును ఉన్న ఆయుధం వంటిది. పూర్తి స్థాయిలో ఒకరికొకరు అర్థం చేసుకుంటే బాగుంటుంది. ఉదాహరణకు ఓ చెడ్డ అలవాటును ఎవరు చెప్పినా మార్చుకోని వ్యక్తి ప్రేమ వల్ల దానికి దూరంగా జరగవచ్చు. కెరీర్‌లో ఎదగడానికి తనే ప్రేరణగా ఉండవచ్చు. కానీ ఇదే సమయంలో అమ్మాయి తిరస్కరిస్తే జీవితమే లేదనుకుని చెడు వ్యసనాలకు బానిసవుతున్న వారు ఎందరో ఉన్నారు.

- డి. కార్తీక్, ఈసీ ఫైనలియర్ స్టూడెంట్

రెండూ బ్యాలెన్స్ చేసుకోగలగాలి

చదువుకునే వయసులో ప్రేమలో పడడం తప్పేమికాదు. కాకపోతే రెండింటిని బ్యాలెన్స్ చేసుకునే పరిపక్వత ఉండాలి. అదే సమయంలో తల్లిదండ్రులను ఒప్పించే ఏ విషయంలో అయినా ముందడుగు వేయాలి. ఒకరి అభిప్రాయంతో మరొకరు ఏకీభవించాల్సిన అవసరమేమి లేదు. ఎదుటి వారి ఇష్టాయిష్టాలను కూడా గౌరవించాలి

- ఎం. వందన, ఈఐఈ, ఫైనలియర్ విద్యార్థిని


బైటమంజులూరులో రీసర్వేలో రికార్డులను తనిఖీ చేస్తున్న ఆర్డీవో చంద్రశేఖర్‌నాయుడు

రీ-సర్వేతో సమస్యలు పరిష్కారం కావాలి

ఆర్డీవో చంద్రశేఖర్‌నాయుడు

పంగులూరు, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా భావిస్తున్న రీ-సర్వేతో గ్రామంలో భూ సమస్యలు పరిష్కరించాలని చీరాల ఆర్డీవో చంద్రశేఖర్‌నాయుడు సూచించారు. మండలంలోని బైటమంజులూరు గ్రామంలో జరుగుతున్న భూముల రీ-సర్వే ప్రక్రియను గురువారం స్థానిక అధికారులతో కలసి పరిశీలించారు. రైతుల సహకారంతో రీ-సర్వే ప్రక్రియ న్యాయబద్ధంగా నిర్వహించాలన్నారు. ఈ సందర్భంగా భూ రికార్డులను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. అనంతరం నూజెళ్లపల్లి గ్రామంలో ప్రజావేదిక ద్వారా అందిన భూ సమస్యను పరిశీలించారు. కార్యక్రమంలో మండల తహసీల్దార్ సింగారావు, సర్వేయర్ సురేష్, శ్రీనివాసరావు, పలువురు సర్వేయర్లు, వీఆర్వోలు రైతులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి పోటీల్లో సెయింట్ ఆన్స్ జయకేతనం


విజేతలతో సెయింట్ ఆన్స్ కళాశాల ప్రతినిధులు

చీరాలటౌన్, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి) : జాతీయ స్థాయి వాలీబాల్ పోటీల్లో చీరాల సెయింట్ ఆన్స్ కాలేజీ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాల జయకేతనం ఎగుర వేసింది. గుంటూరు విజ్ఞాన్ యూనివర్సిటీలో జాతీయ స్థాయి యూత్ ఫెస్టివల్ పోటీలు జరగగా అందులో 48జట్లతో పోటీపడిన సెయింట్ ఆన్స్ విద్యార్థులు విజేతలుగా నిలిచారు. దీంతో గురువారం కళాశాల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన అభినందన సభలో విజేతలను కళాశాల సెక్రటరీ వనమా రామకృష్ణారావు, కరస్పాండెంట్ శ్రీమంతుల లక్ష్మణరావు ప్రిన్సిపల్ డా.జగదీష్, తదితరులు ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో విజేతలు మరియు అధ్యాపక అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

విజన్ బిల్డింగ్‌పై ప్రతి ఒక్కరికీ అవగాహన


విజన్ బిల్డింగ్‌పై గ్రామ సంఘ అధ్యక్షులకు శిక్షణ ఇస్తున్న డీఆర్‌డీఏ పీడీ పద్మ

చీరాలటౌన్, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి) : విజన్ బిల్డింగ్‌పై ప్రతిఒక్క వీవోఏ అవగాహన కలిగి ఉండాలని డీఆర్‌డీఏ పీడీ పి.పద్మ అన్నారు. మండల పరిధిలోని వెలుగు కార్యాలయంలో 14 మోడల్ మండలాల్లో ఉన్న సిబ్బందికి మూడు రోజుల శిక్షణ కార్యక్రమం గురువారం ప్రారంభమైంది. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో పీడీ పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఏసీ ఉసురుపాటి సుబ్బారావు, ఏపీఎంలు గద్దె సుబ్బారావు, శ్రీనివాసరావు, కడెం మధుసూదనరావు, వీవోఏలు, సిబ్బంది పాల్గొన్నారు.

నీటి వనరుల గణన పక్కాగా నిర్వహించాలి

అద్దంకి, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): చిన్న తరహా నీటి వనరుల గణన పక్కాగా నిర్వహించాలని డిప్యూటీ స్టాటికల్ ఆఫీసర్ డేవిడ్ అన్నారు. అద్దంకి, బల్లికురవ, సంతమాగులూరు, కొరిశపాడు మండలాల పరిధిలోని వీఆర్‌వోలకు గురువారం గణనపై తహసీల్దార్ కార్యాలయంలో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ప్రతి 5 సంవత్సరాలకోసారి చిన్న తరహా నీటి వనరుల (వ్యవసాయ బోర్లు, బావులు, చెరువులు) గణన నిర్వహించడం జరుగుతుందన్నారు. రెవెన్యూ గ్రామాల ఆధారంగా గణన చేయాలన్నారు. కార్యక్రమంలో ఆయా మండలాల ఏఎస్‌వోలు అమరనాథ్, సుబ్రహ్మణ్యం, అనూష, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

మైలవరం చెరువు వద్ద వివాదాస్పద భూమి పరిశీలన

అద్దంకి, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మైలవరం వద్ద ఉన్న చెరువు వద్ద వివాదాస్పదంగా ఉన్న భూమిని చీరాల ఆర్డీవో చంద్ర శేఖర్‌నాయుడు గురువారం పరిశీలించారు. గత ఐదారు సంవత్సరాలుగా ఈ భూమి విషయం తరచూ వివాదాలు జరుగుతున్నాయి. దీంతో పోలీస్ స్టేషన్‌లో కేసులు కూడా నమోదయ్యాయి. ఇటీవల అద్దంకిలో జరిగిన రెవెన్యూ సదస్సులో పాల్గొన్న మంత్రి గొట్టిపాటి రవికుమార్ దృష్టికి చె రువు వద్ద భూమి విషయాన్ని గ్రామస్థులు తీసుకుపోయారు. దీంతో గురువారం ఆర్డీవో వివాదాస్పద భూమిని పరిశీలించారు. తహసీల్దార్ శ్రీచరణ్, ఆర్ఐ శంకర్, మండల సర్వేయర్ శ్రీలక్ష్మి ఉన్నారు.

మోటార్ సైకిలిస్టుకు గాయాలు

అద్దంకి, ఫిబ్రవరి 13 (ఆంధ్ర జ్యోతి) : అద్దంకి పట్టణంలోని భవానీ సెంటర్‌లో లారీ, మోటార్‌సైకిల్ ఢీకొనడంతో మోటార్‌సైకిలిస్టుకు గాయాలయ్యాయి. స్థానికుల కథనం మేరకు... గురువారం సాయంత్రం అద్దంకి పట్టణంలోని దామావారిపాలెంకు చెందిన శ్రీనివాసరావు మోటార్‌సైకిల్‌పై రేణింగవరం రోడ్డులో నుంచి దర్శి రోడ్డులోకి వెళ్లే క్రమంలో లారీ ముందు భాగంలో ఢీకొన్నాయి. గాయపడ్డ శ్రీనివాసరావును స్థానిక ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

పొలం తగాదాపై కేసు

మార్టూరు, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి) : తన పొలంలోకి అక్రమంగా ప్రవేశించి పొలం దున్నడానికి ప్రయత్నించారని పెంట్యాల సత్యనారాయణ అనే వ్యక్తి కాళహస్తి వాసుదేవమూర్తి, తాళ్లూరి బెన్ని లనే వ్యక్తులపై గురువారం స్టేషన్‌లో ఫిర్యాదు చేశారని సీఐ ఎం.శేషగిరిరావు తెలిపారు. మండలంలోని వలపర్ల పంచాయతీ పరిధిలోని ద్వారకపాడు గ్రామానికి చెందిన పొలంలో అక్రమంగా ప్రవేశించారని సత్యనారాయణ తన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.


శ్రీనివాసులును అభినందిస్తున్న కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు

జాతీయ మాస్టర్స్ అథ్లెటిక్స్‌లో అధ్యాపకుడి ప్రతిభ

అద్దంకిటౌన్, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి) : జాతీయ మాస్టర్స్ అథ్లెటిక్స్‌లో అద్దంకిలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో పని చేస్తున్న అధ్యాపకుడు ప్రతిభ చూపారు. పాలిటెక్నిక్ కళాశాలలో సాధారణ శాఖాధిపతిగా పని చేస్తున్న డాక్టర్ తాడికొండ శ్రీనివాసులు ఈ నెల 6 నుంచి 8వ తేదీ వరకు రాజస్థాన్‌లో జరిగిన 44వ నేషనల్ మాస్టర్ అథ్లెటిక్స్ ఓపెన్ చాంపియన్‌షిప్-2025లో ఆంధ్రప్రదేశ్ తరపున పదివేల మీటర్ల పరుగు పందెంలో మూడవ స్థానం సాధించి కాంస్య పతకాన్ని పొందారు. ఈ సందర్భంగా గురువారం కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు, సిబ్బంది ఘనంగా సత్కరించి అభినందించారు. శ్రీనివాసులు సాధించిన విజయం రాష్ట్రానికి, కళాశాలకు ఎంతో గర్వకారణమని, భవిష్యత్‌లో మరిన్ని పతకాలు సాధించాలని ఆకాంక్షించారు.

అంగన్‌వాడీ కార్యకర్తలకు శిక్షణ


శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న సీడీపీవో ఝాన్సీ

చినగంజాం, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి) : మండలంలోని కడవకుదురు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఇంకొల్లు ప్రాజెక్టు పరిధిలోని అంగన్‌వాడీ కార్యకర్తలకు పోషణ్ బీ, పడాయి బీపై గురువారం శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. పోషణ్ బీ, పడాయి బీపై గురువారం నుండి శనివారం వరకు శిక్షణ ఇవ్వనున్నట్లు ఇంకొల్లు సెక్టారు సీడీపీవో టి.ఝాన్సీ తెలిపారు. మొదటి రోజు పడాయి బీపై అంగన్‌వాడీ కార్యకర్తలకు శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు. శిక్షణా కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని అంగన్‌వాడీ కార్యకర్తలకు సూచించారు. పడాయి శిక్షణలో భాగంగా ఐదు రకాల అభివృద్ధిలో అంగన్‌వాడీల యొక్క అభివృద్ధిలకు సంబంధించి శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్.ఎం. కుర్రా రామారావు, సూపర్‌వైజర్లు వాణిశ్రీ, సుమలత, ఉషాకుమారి, అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

జ్యోతయ్య చిరస్మరణీయుడు

అద్దంకి, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి) : మిలటరీ ఉద్యోగిగా దేశ సేవ చేసి పదవీ విరమణ చేసి సామాజిక సేవకు అంకితమైన పంతంగి జ్యోతయ్య చిరస్మరణీయుడు అని రిటైర్డ్ మిలటరీ ఉద్యోగి, యోగా గురువు శేషారెడ్డి అన్నారు. పంతంగి పెద జ్యోతయ్య సంస్మరణ సభ గురువారం స్థానిక పోలీస్ స్టేషన్ ఎదురు ఉన్న స్వగృహం వద్ద జరిగింది. ఈ సందర్భంగా పలు సాహితీ సంస్థల ప్రతినిధులు హజరై జ్యోతయ్య చిత్రపటం వద్ద పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ నిత్యం పేదలకు సేవ చేసేందుకు పరితపించిన జ్యోతయ్య పేదల జీవితాలలో వెలుగులు నింపారన్నారు. నర్రావారిపాలెం శ్మశాన వాటికకు జ్యోతయ్య శాంతివనంగా మార్చాలని పలువురు సూచించారు. కార్యక్రమంలో పలు సాహితీ సంస్థల ప్రతినిధులు దివాకర్ దత్, తాళ్లూరు వెంకటసుబ్బయ్య, మన్నం త్రిమూర్తులు, చప్పిడి వీరయ్య, భద్రయ్య, మలాది శ్రీనివాసరావు, చుండూరి మురళీసుధాకర్, రఫీ, కావూరి రఘుచంద్, పుట్టంరాజు శ్రీరామచం ద్రమూర్తి, పంతంగి ఆంజనేయులు, ధనుంజయరావు తదితరులు పాల్గొన్నారు.



జ్యోతయ్యకు నివాళులు అర్పిస్తున్న సాహితీ సంస్థల ప్రతినిధులు

రైతులకు తీపిని పంచుతున్న నల్ల చెరకు

- ఈ ఏడాది మంచి డిమాండ్
- పెట్టుబడులు పోను ఎకరాకు రూ.2లక్షల పైనే ఆదాయం
- బల్లికురవ మండలంలో 200 ఎకరాల్లో సాగు
- ఇతర ప్రాంతాల నుంచి వ్యాపారులు వచ్చి కొనుగోలు

బల్లికురవ, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి) : ఈ ఏడాది నల్ల చెరకు సాగు చేసిన రైతులు లాభాలబాటలో ఉన్నారు. పెట్టుబడులు పోను ఎకరాకు రెండు లక్షల వరకు ఆదాయం వస్తుంది. చెరకు సాగు చేసిన రైతుల్లో ఆనందరం వెల్లివిరుస్తోంది. వ్యాపారులు సైతం గ్రామాలకు వచ్చి చెరకు గెడలను కొనుగోలు చేసి వెళుతుండడంతో రైతులకు కూడా పెద్ద ఇబ్బంది లేదు. గత ఏడాది ధరలు కొంత వెనకంజ వేయగా ఈ ఏడాది మాత్రం మంచి డిమాండ్‌తో కొనుగోళ్లు జరుగుతున్నాయి. తాము చెరకు పంటను నమ్ముకొని సాగు చేస్తున్నామని, ధరలు ఆశాజనకంగా ఉన్నాయని రైతులు అంటున్నారు.

బల్లికురవ మండలం అంటే జనవరి నుంచి నల్ల చెరకు పంటకు కేరాఫ్‌గా మారుతుంది. మండలంలోని కూకట్లపల్లి, గొర్రెపాడు గ్రామాలలో ఎన్నో ఏళ్ల నుంచి రైతులు నల్ల చెరకును సాగు చేస్తున్నారు. ఈ ఏడాది అ గ్రామాలను చూసి అంబడిపూడి, వైదన, కొత్తూరు, వెలమవారిపాలెం తదితర గ్రామాలలో కూడా రైతులు చెరకు పంట వైపు ఆసక్తిని చుపారు. మండలంలో మెత్తం 200 ఎకరాల్లో రైతులు గత ఏడాది ఏప్రిల్‌లో నల్ల చెరకు సాగు చేశారు. బోరు బావుల నీరు అందుబాటులో ఉన్న రైతులకు చెరకు పంట తీపిని పంచింది. రైతులు పండించిన నల్ల చెరకు కోతలు గత పదిహేను రోజుల నుంచి ఊపందుకున్నాయి. రైతుల వద్దకు వైజాగ్, విజయవాడు, కాకినాడ, భీమవరం, నంద్యాల, అత్మకూరు, కలిదిండి, ఏలూరు, కడప తదితర ప్రాంతాల నుంచి వ్యాపారులు వచ్చి నల్ల చెరకును కొనుగోలు చేస్తున్నారు. ఎకరా చెరకు పంటను రూ.4 లక్షల వరకు కొనుగోలు చేస్తున్నారు. ఎకరా చెరకు తోటలో 25వేల నుంచి 30వేల వరకు గెడల దిగుబడి వస్తున్నాయి. వ్యాపారులు గెడలను కొట్టించుకొని లారీలలో తరలిస్తున్నారు. రుచిగా, తీపిగా చెరకు గెడలు బహిరంగ మార్కెట్‌లో ఒకటి రూ.40కి వ్యాపారులు విక్రయిస్తున్నారు. ఎన్నో ఏళ్ల నుంచి నల్ల చెరకు సాగుకు బల్లికురవ మండలం ప్రసిద్ధి చెందడంతో వ్యాపారులు కూడా సీజన్ వస్తే నేరుగా వస్తున్నారని రైతులు తెలిపారు.


కూకట్లపల్లిలో సాగు చేసిన నల్ల చెరకు


చెరకు గడలకు ఉన్న ఆకును తొలగిస్తున్న కూలీలు

చెరకు సాగుకు పెట్టుబడులు ఇలా

ఎకరంలో నల్ల చెరకు సాగు చేయాలంటే రైతులు ముందుగా ఎకరాకు విత్తనపు చెరకు ముక్కలు 12 వందలు నాటుతారు. ఒక గెడ రూ.10 వెచ్చించి తెస్తారు. పెట్టుబడులు పోయి గెడలు కొట్టుడుకు వచ్చే సమాయానికి రూ.2లక్షల వరకు రైతులకు ఖర్చులు అవుతాయి. ఎకరం చెరకు సాగుకు కౌలు కూడా రూ.40వేల వరకు పలుకుతుంది. రైతులు ఎకరా రూ.4లక్షలకు వ్యాపారులకు అమ్మకాలు చేస్తున్నారు. ఏడాది కాలంలో చెరకు సాగు పూర్తి అయి అమ్మకాలు పూర్తి అవుతాయి. రిటైల్‌గా అయితే రైతులు తోటల వద్ద ఒక గెడ రూ.30కి అమ్మకాలు చేస్తున్నారు. అదే వ్యాపారులు అయితే ఒక గెడ రూ.40కి అమ్మకాలు చేస్తున్నారు.

రెండు గ్రామాల్లో అధికం

బల్లికురవ మండలంలోని కూకట్లపల్లి, గొర్రెపాడు గ్రామాలలోనే గత రెండు దశాబ్దాల నుంచి రైతులు నల్ల చెరకు సాగు చేస్తున్నారు. నష్టాలు వచ్చిన లాభాలు వచ్చినా రైతులు చెరకును పండిస్తుంటారు. మెదట్లో వ్యాపారులు వచ్చి కొనుగోలు చేయని సమయంలో రైతులే నేరుగా తిరునాళ్లకు తీసుకెళ్లి అమ్మేవారు. అయితే మంచి రుచి, నాణ్యమైన చెరకు దిగుబడి అవుతుండడంతో వ్యాపారులే నేరుగా వచ్చి కొంటున్నారని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఈ రెండు గ్రామాలలో సాగును చూసిన పక్కపక్క గ్రామాల్లో కూడా అడపాదడపా సాగు చేస్తున్నారు.

ఈ ఏడాది మంచి లాభాలు



తాను ఒకటిన్నర ఎకరంలో నల్ల చెరకును సాగు చేశాను. ఎకరా కౌలు రూ.40వేలు చెల్లించి సాగు చేశాను. రూ.2 లక్షల వరకు పెట్టుబడులు పెట్టాను. రూ.4లక్షలకు ఎకరం చెరకు అమ్మాను. ఎకరాకు రెండు లక్షల ఆదాయం వచ్చింది. ఇతర ప్రాంతాల నుంచి వ్యాపారులు వచి కొనుగోలు చేస్తున్నారు.

- పులి దావీదు, రైతు కూకట్లపల్లి

ఎకరానికి కౌలు రూ.40వేలు చెల్లిస్తున్నాం



నల్ల చెరకు సాగు చేసే భూములకు ఎకరాకు రూ.40వేలు కౌలు చెల్లిస్తున్నాం. ఎకరాకు 12 వందల నుంచి 2వేల చెరకు మొక్కలను నాటతాం. ఏడాది సమయంలో చెరకు సాగు, అమ్మకాలు పూర్తి అవుతాయి. గత ఏడాది కంటే ఈ ఏడాది అమ్మకాలకు డిమాండ్ ఉంది.

- బొంతు సాల్, ఎస్సీ రైతు, కూకట్లపల్లి

ఐదు ఎకరాల చెరకును కొనుగోలు చేశాను



తానే కూకట్లపల్లి గ్రామంలో రైతుల వద్ద ఐదు ఎకరాల నల్ల చెరకును కొనుగోలు చేశాను. ఎకరాకు రూ.4లక్షలు చెల్లించాను. తానే చెరకు గెడలను కొట్టించి రిటైల్‌గా అమ్మకాలు చేస్తాం. ఒక గెడ రూ.40 వంతున అమ్మకాలు చేస్తాం, ఎన్నో ఏళ్ల నుంచి చెరకును కొనుగోలు చేస్తున్నాను.

- కె.మురళి, చెరకు వ్యాపారి, విశాఖపట్నం


పనులను పరిశీలిస్తున్న డా.మహేంద్రనాథ్

తాగు నీటికి ఇబ్బంది లేకుండా చూడండి

డా.మహేంద్రనాథ్

చీరాలటౌన్, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి) : చీరాల నియోజకవర్గంలో ప్రజలకు, రైతులకు సాగు, తాగు నీటికి ఇబ్బంది లేకుండా చూడాలని టీడీపీ నియోజకవర్గ అధికార ప్రతినిధి డా.మహేంద్రనాథ్ అన్నారు. కారంచేడు సమీపంలోని కొమ్మమూరు కాలువ నుంచి చీరాలకు వచ్చే పైప్‌లైన్ మరమ్మతులను గురువారం అధికారులతో కలిసి మహేంద్రనాథ్ పరిశీలించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ రానున్న వేసవికి నీటి ఎద్దటి లేకుండా చూడాలన్నారు. పనులు వేగంగా పూర్తి చేయాలన్నారు. పారిశుధ్య సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పనుల్లో నిరక్ష్యం లేకుండా చూడాలని మహేంద్రనాథ్ సూచించారు. కార్యక్రమంలో మునిసపల్ డీఈ పరంధామయ్య, పలువురు అధికారులు పాల్గొన్నారు.

కార్డున్న ప్రతి కుటుంబానికీ రేషన్ అందాలి


ముప్పవరంలో రేషన్ షాపును తనిఖీ చేస్తున్న అధికారులు

పంగులూరు, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి) : రేషన్ కార్డుఉన్న ప్రతి కుటుంబానికి నిర్ణీత వ్యవధిలో రేషన్ అందచేయాలని మండల తహసీల్దార్ పి.సింగారావు, పర్చూరు ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ గీతారాణి అన్నారు. మండలంలోని ముప్పవరం గ్రామంలో గురువారం 11, 12 నెంబర్ రేషన్ షాపులలో రెవెన్యూ అధికారులు ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. రికార్డులను, నిల్వ ఉన్న స్టాక్‌ను పరిశీలించారు. రేషన్ పంపిణీ వివరాలు అడిగి తెలుసుకున్నారు. తనిఖీలో మండల ఆర్‌ఐ శ్వేత, సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

బర్లీ కొనుగోలుకు చర్యలు చేపట్టండి

రైతు సంఘం విజ్ఞప్తి

పంగులూరు, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి) : నల్లబర్లీ కొనుగోలుకు ప్రభుత్వం తగిన చర్యలు చేపట్టాలని రైతు సంఘం జిల్లా కార్యదర్శి తలపనేని రామారావు విజ్ఞప్తి చేశారు. మిరప, శనగ సాగులో నష్టాలను చవిచూసిన రైతులు గత ఏడాది బర్లీ ధరలు ఆశాజనకంగా ఉండడంతో పొగాకు సాగుకు మొగ్గు చూపారన్నారు. అద్దంకి, పర్చూరు నియోజకవర్గాల పరిధిలో షుమారు 90వేల ఎకరాలలో బర్లీ పొగాకు సాగు చేశారన్నారు. దీనిలో నల్లబర్లీ సాగు అధికంగా ఉందని, పొగాకు దిగుబడులు రైతుల వద్దకు చేరుకున్నా కంపెనీలు కొనుగోలు ప్రారంభించక పోవడంతో రైతాంగం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. మార్కెట్లో సరైన ధర లభించే పరిస్థితి లేదనే ఆందోళనలో ఉన్న రైతుల స్థితిని దళారులు సొమ్ము చేసుకునే పరిస్థితి నెలకుందన్నారు. ప్రభుత్వం నల్ల బర్లీ సాగు చేసిన రైతులను ఆదుకునే విదంగా తగిన చర్యలు చేపట్టాలని కోరుతూ మండల వ్యవసాయాధికారి సుబ్బారెడ్డికి రైతులతో కలసి గురువారం వినతిపత్రం అందచేవారు.

గైర్హాజరైన అధికారులకు మెమోలు

యద్దనపూడి, (మార్టూరు) ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి) : మండల సర్వసభ్య సమావేశానికి హాజరుకాని 7శాఖలకు చెందిన మండల స్థాయి అధికారులకు గురువారం ఎంపీడీవో లక్ష్మీనారాయణ మెమో నోటీసులు జారీ చేశారు. బుధవారం జరిగిన మండల సర్వసభ్య సమావేశానికి ఆరోగ్యం, విద్యుత్, వ్యవసాయం, పంచాయతీరాజ్, పోలీస్, రోడ్లు రహదారులు, ఆర్టీసీ శాఖలకు చెందిన అధికారులు హాజరుకాలేదు. దాంతో సంబంధిత అధికారులకు మెమోలు జారీ చేశారు.

చిన్నారులకు క్రమం తప్పకుండా పౌష్టికాహారం


పోషణ్‌బీపై అవగాహన కల్పిస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

బల్లికురవ, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి) : అంగన్‌వాడీ కేంద్రాలలో చిన్నారులకు క్రమం తప్పకుండా పౌష్టికాహారం అందిస్తున్నామని సంతమాగులూరు ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీవో సుధ పేర్కొన్నారు. గురువారం మండలంలోని కొప్పెరపాడు ఉన్నత పాఠశాలలో 40 మంది అంగన్‌వాడీ కార్యకర్తలకు పోషణ్‌బీ పడాయిబీపై శిక్షణ తరగతులు జరిగాయి. ఈసందర్భంగా పలువురు కార్యకర్తలు పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. చిన్నారులకు కేంద్రాల ద్వారా అందుతున్న వసతులను వివరించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు సలోమి, విజయనిర్మల పాల్గొన్నారు.

అద్దంకిటౌన్ : అంగన్‌వాడీ కార్యకర్తలకు గురువారం అద్దంకి పట్టణంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో పోషణ్ బీ, పడాయి బీపై ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు కె.రమాదేవి, బీ ఇందిరమ్మ శిక్షణ ఇచ్చారు. 0 నుంచి 6 సంవత్సరాల లోపు పిల్లలకు పోషణతో పాటు విద్యను అందించడం, పిల్లల అభివృద్ధి, సంరక్షణ విద్య గురించి వి వరించారు. 0-3 సంవత్సరాల చిన్నారులకు నవ చేతన విద్యా విధానం, 3-6 సంవత్సరాల పిల్లలకు ఆదర్శ శీల విద్యా విధానాలను గురించి పీబీ ప్రొగ్రాం ద్వారా అందించారు. కార్యక్రమంలో మండలంలోని 90 మంది అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

మృతి చెందిన మహిళ గుర్తింపు

ఆమె వేటపాలెం బండ్ల బాపనయ్య కళాశాల లెక్చరర్


సౌజన్య (ఫైల్)

వేటపాలెం(చీరాలటౌన్), ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి) : రైలు ప్రమాదంలో గత రెండు రోజుల కిందట మృతి చెందిన మహిళను చీరాల రైల్వే పోలీసులు గుర్తించారు. ఆమె వేటపాలెంకు చెందిన బొజ్జగాని సౌజన్య(48). ఈమె స్థానిక బండ్ల బాపనయ్య జూనియర్ కళాశాలలో కామర్స్ లెక్చరర్‌గా పనిచేస్తున్నారు. భర్త గతకొంత కాలం కిందట మృతిచెందగా, కుమార్తె విజయవాడలో లా కోర్స్ చేస్తుండగా, కుమారుడు ఇతర ప్రాంతంలో చదువుతున్నాడు. ఈక్రమంలో రోజులాగే వాకింగ్ నిమిత్తం ఇంటి నుంచి బయటకు వచ్చి పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొని మృతి చెందారు. మృతదేహానికి గురువారం పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించారు. తల్లిదండ్రులను కోల్పోయిన బిడ్డలు విలపిస్తుండగా బంధువులు ఓదార్చారు.


కార్యాలయంలో రికార్డులను పరిశీలిస్తున్న ఆర్డీవో గ్లోరియా, తహసీల్దార్ రవికుమార్

పూనూరులో రీసర్వే వేగవంతం చేయాలి

యద్దనపూడి, (మార్టూరు) ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి) : యద్దనపూడి మండలం పూనూరు గ్రామంలో జరుగుతున్న రీ-సర్వే కార్యక్రమం వేగవంతంగా చేయాలని, మార్చి మొదటివారానికి పూర్తి చేయాలని ఆర్డీవో గ్లోరియా అధికారులను ఆదేశించారు. గురువారం ఆర్డీవో యద్దనపూడి తహసీల్దారు కార్యాలయానికి వచ్చారు. మండలంలో పైలెట్ ప్రాజెక్ట్ కింద పూనూరు గ్రామంలో జరుగుతున్న రీసర్వే వివరాలను తహసీల్దారు కే రవి కుమార్‌తో పాటు మిగిలిన అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్బంగా తహసీల్దార్ పూనూరులో 4952 ఎకరాలు పొలాలు విస్తీర్ణం ఉండగా వాటిలో 1400 ఎకరాల రీసర్వే పూర్తయిందన్నారు. గ్రామంలో ప్రత్యేకంగా 4 బృందాలు రీసర్వే చేస్తున్నారన్నారు. అందుకు సంబంధించి కొన్ని రికార్డులను గ్లోరియా పరిశీలించారు. త్వరితంగా ప్రజలకు, రైతులకు ఇబ్బందిలేకుండా ఎలాంటి లోటుపాట్లు లేకుండా రీ-సర్వేను పూర్తి చేయాలని ఆమె చెప్పారు. కార్యక్రమంలో బాపట్ల నుంచి వచ్చిన డీఐ శ్రీనివాసరావు, రీసర్వే డీటీలు మస్తానరావు, విష్ణు, పాల్గొన్నారు.

మద్యం మత్తులో యువకుల గొడవ

మార్టూరు, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి) : మద్యం సేవిస్తూ బుధవారం అర్ధరాత్రి కొణిదెన రోడ్డులో కొంతమంది యువకులు గొడవ చేసిన ఘటన జరిగింది. అందిన సమాచారం మేరకు.. మార్టూరు గ్రామానికి చెందిన కొంతమంది యువకులు కొణిదెన రోడ్‌లో మద్యం సేవించారు. అనంతరం రోడ్డుపై అరుపులు, కేకలు వేసుకుంటూ అదేమిటని అడిగిన మహిళపై కూడా భౌతికదాడి చేసినట్లు తెలిసింది. అనంతరం వారు కొణిదెన రోడ్డు వద్ద మద్యం సేవిస్తుండగా గస్తీ పోలీసులు వారిని అక్కడ నుంచి పంపించి వేసినట్లు తెలిసింది. కొణిదెన రోడ్‌లో మద్యం దుకాణాలు ఉండడంతో యువకులు మద్యం కొనుగోలుకు వెళ్లిన సమయంలో ఈ గొడవ జరిగినట్లు తెలిసింది. ఈ విషయమై గురువారం సీఐ ఎం.శేషగిరిరావును ఆంధ్రజ్యోతి వివరణ కోరగా తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదన్నారు. అయినా పూర్తి స్థాయిలో విచారణ చేపడతామన్నారు.

యద్దనపూడి మండలంలో విద్యుత్ అధికారుల తనిఖీలు

యద్దనపూడి, (మార్టూరు) ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి) : యద్దనపూడి మండలంలో విద్యుత్ అధికారుల బృందాలు గురువారం గ్రామాలలో తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీలలో 43 విద్యుత్ సర్వీసులకు చెందిన వారు విద్యుత్ అధిక లోడు వినియోగిస్తున్నారని వారికి 1 లక్షా 23 వేల రూపాయలను పెనాల్టీగా విధించినట్లు బాపట్ల ఏపీసీపీడీసీఎల్ సూపరింటెండెంట్ ఇంజనీర్ జీ అంజనేయులు తెలిపారు. గ్రామాలలో విద్యుత్ అధికారుల బృందాలు తనిఖీలు నిర్వహించిన తర్వాత యద్దనపూడి విద్యుత్ కార్యాలయం వద్ద అధికారులతో కలిసి ఎస్ఈ అంజనేయులు విద్యుత్ వినియోగదారులతో మాట్లాడారు. దొంగతనంగా విద్యుత్‌ను వినియోగించడం, అక్రమ పద్ధ తులు ద్వారా విద్యుత్‌ను వినియోగించాలనుకోవడం నేరమన్నారు. నెలవారీ బిల్లు లు వెంటనే చెల్లిస్తే పెనాల్టీలే ఉండవన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న బాపట్ల ఎస్ఈ అంజనేయులు, విజిలెన్స్ డీఈఈ మల్లికార్జునరావు, అద్దంకి ఈఈ మస్తానరావు

కరెంటు మీటర్లు లేని వారు దరఖాస్తు చేసుకుంటే వెంటనే వారికి మీటరును అందచేస్తామన్నారు. అదేవిధంగా ప్రధాన మంత్రి సూర్యఘర్ పథకాన్ని అందరూ వినియోగించుకోవాలన్నారు. తద్వారా విద్యుత్ బిల్లులు తగ్గుతాయన్నారు. ఈ కార్యక్రమంలో విజిలెన్స్ డీఈ మల్లికార్జునరావు, అద్దంకి ఈఈ మస్తానరావు, యద్దనపూడి ఏఈ టీ సురేష్ బా బు, పలువురు విద్యుత్ ఏఈలు, సిబ్బంది పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు వేగవంతంగా పూర్తి చేయండి

అద్దంకిటౌన్, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను అర్హులకు అందించడంతో పాటు గ్రామాలలో జరుగుతున్న అభివృద్ధి పనులు త్వరతగితన పూర్తయ్యేలా చూడాలని ఎంపీడీవో బత్తిని సింగయ్య అన్నారు. గురువారం ఎంపీడీవో కార్యాలయంలోని సమావేశపు హాల్‌లో మండల ప్రజా పరిషత్ సాధారణ సమావేశం ఎంపీపీ ఏ.జ్యోతి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా సమావేశానికి పలు శాఖల అధికారులు హజరై పథకాల గురించి వివరించారు. సాధారణ సమావేశం వచ్చామా, వెళ్లామా అన్నట్లుగా సాగింది. సమావేశంలో కొందరు ఎంపీటీసీ సభ్యులు కనిపించకపోయినా వారి తరపున షాడోలు మాత్రం ప్రత్యక్షమయ్యారు. సంతకాలు చేసి వెళ్లేవరకే వారి బాధ్యతగా నిర్వహించారు. సమావేశంలో డిప్యూటీ తహసిల్దార్ సురేషబాబు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న అధికారి, పక్కన ఎంపీపీ, ఎంపీడీవో, డీటీ

హెచ్ఐవీపై అవగాహన

మార్టూరు, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి) : మర్టూరు లోని వీఎస్ఆర్ అండ్ ఏఎం డిగ్రీ కళాశాలలో గురువారం దిశా హెల్ప్ స్వచ్ఛంద సంస్థ టీఐ ఆధ్వర్యంలో విద్యార్థులకు హెచ్ఐవీ ఎయిడ్స్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ వీరగంధం శ్రీనివాసరావు, ప్రిన్సిపాల్ రావి అంకమ్మ చౌదరి, ప్రాజెక్టు డైరెక్టర్ సాగర్ పాల్గొన్నారు.

పోతుకట్లలో చోరీ

పోతుకట్ల (పర్చూరు), ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని పోతుకట్ల గ్రామంలో తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ జరిగిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. గ్రామానికి చెందిన గండికోట బాజీ ఇంటికి తాళం వేసి పొలం పనులకు వెళ్లారు. బుధవారం సాయంత్రం ఇంటికి వచ్చి చూసే సరికి తాళం తీసి ఉండడాన్ని గుర్తించారు. వెంటనే లోపలికి వెళ్లి చూడగా బీరువా తాళం తీసి అందులో ఉన్న 10గ్రాముల బంగారు వస్తువులు దొంగిలించినట్లు చూసి ఆందోళన చెందారు. వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు ఆ ఇంటిని పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ మాల్యాద్రి తెలిపారు.

నాణ్యమైన బోధనకే నూతన విద్యా విధానం

బల్లికురవ, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందించేందుకు ప్రభుత్వం గ్రామాలలో ఉన్న పాఠశాలల్లో నూతన విద్య విధానాన్ని అమలులోకి తెచ్చిందని ఉపాధ్యాయులందరూ విద్యార్థుల హాజరు శాతం పెరిగేలా పనిచేయాలని తహసీల్దార్ రవినాయక్ పేర్కొన్నారు. గురువారం స్థానిక విద్యా వనరుల కేంద్రంలో పాఠశాలల అప్‌గ్రేడ్‌లపై మండల స్థాయి కమిటీలో ఉన్న ఎంపీడీవో కుసుమకుమారి, తహసీల్దార్ రవినాయక్, ఎంఈవోలు వస్త్రంనాయక్, రమేష్ అన్ని పాఠశాలల హెచ్‌ఎంలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. మండలంలో విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా పాఠశాలలను మెడల్ పాఠశాలలుగా ఎంపిక చేస్తున్నామని తెలిపారు. నూతన హైస్కూల్స్ కోసం ప్రతిపాదనలు పంపామని స్థలాలను వెంటనే చుసి పెట్టాలని హెచ్‌ఎంలను వారు కోరారు.


సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ రవినాయక్

రానున్న విద్యా సంవత్సరంలో విద్యార్థులు ప్రభుత్వ బడిలో చేరేలా ఇప్పటి నుండే ఉపాధ్యాయులు గ్రామాలలో ప్రత్యేక క్యాంపెయిన్ చేయాలని కోరారు.

కొప్పెరపాడు పాఠశాలలో తనిఖీ

మండలంలోని కొప్పెరపాడు గ్రామంలో ప్రాథమిక పాఠశాల (హెచ్‌ఈ), ఎస్టీ కాలనీ పాఠశాలను ఎంఈవో వస్త్రం నాయక్ గురువారం తనిఖీ చేశారు. ఈసందర్భంగా పాఠశాలలో విద్యార్థుల రోల్‌ను పరిశీలించి రానున్న ఏడాదికి విద్యార్థుల రోల్ పెరిగితే మోడల్ స్కూల్‌గా ఎంపిక చేస్తామని తెలిపారు.